# మనస్సు యొక్క స్థితులు



రచన:

బ్రహ్మావిద్వరిష్ఠ

**తటవర్తి రాజ్యలక్ష్మి**

# మనసు యొక్క స్థితులు




రచన : బ్రహ్మావిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి



మొదటి ముద్రణ : ఫిబ్రవరి, 2026

ప్రతులు : 2,000

వెల : రూ. 40/-

పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 16) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 17) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 18) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |
| 19) మనస్సు యొక్క స్థితులు | - | రూ.40/- |

తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు
వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు
ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# మనసు యొక్క స్థితులు

మానవులు ప్రతి రోజు ఎన్నో విషయాలు తెలుసుకుంటూ ఉంటారు. అలా తెలుసుకున్న కొంతమంది ఏమీ చేయకుండా ఉండి పోతారు, కొంతమంది విన్న విషయాలను మర్చిపోతారు, కొంతమంది ఆ విషయాల ద్వారా ఎన్నో నేర్చుకొని జీవితంలో పురోగతి సాధిస్తారు.

మానవులలో ఇలాంటి తేడాలు ఎందుకు ఉంటాయి అని మీరు గమనిస్తే వారి మనసు యొక్క స్థితులను బట్టి వారి ప్రవర్తన, వారు పొందే జ్ఞానం ఆధారపడి ఉంటుంది అని తెలుస్తుంది.

ఈ సృష్టిలో 84 లక్షల రకాల జీవులు, జీవరాశులుగా జన్మ తీసుకుని చివరిగా మానవ జన్మలోకి రావడం జరుగుతుంది. అలా మానవ జన్మ తీసుకున్న మానవుడు తన జీవిత లక్ష్యం ఏమిటి? తన గమ్యం ఏమిటి? అని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.

కానీ ఈ కలియుగంలో చాలా మంది జీవించినంత కాలం ఎంజాయ్ చేయడానికి, అనుభవించడానికి అన్నట్టు జీవిస్తున్నారు. కానీ పత్రిజీ లాంటి గురువులు మీ జీవితంలోకి రావడం వలన మీ గమ్యం ఏమిటి? మీ లక్ష్యం ఏమిటి? సత్యం అంటే ఏమిటి? ధర్మాన్ని ఎలా ఆచరించాలి? జ్ఞానాన్ని ఎలా పొందాలి? మోక్షాన్ని పొందే మార్గం ఏమిటి? అన్నది తెలుసుకుంటారు. జీవిత లక్ష్యం, గమ్యం కూడా తెలుసు కుంటారు.

మానవుడి పురోగమనం మనసు వల్ల ఉంటుంది. మనసు ప్రపంచం వైపు తిరిగితే పురోగమనం మందకొడిగా ఉంటుంది. మనసు ఆత్మ వైపు తిరిగితే పురోగమనం ఎక్కువగా ఉంటుంది.

అందుచేత మనస్సు గురించి తెలుసుకుందాం. మానవుడి మనస్సు 'పంచావస్థలలో' ఉంటుంది. అవి 1) స్మృతి, 2) మతి, 3) బుద్ధి, 4) ప్రజ్ఞ,

5) ప్రతిభ.

మానవుని యొక్క మనసు ఈ ఐదు రకాలుగా పనిచేస్తుంది.

**1) స్మృతి :**

మీరు తెలుసుకున్న ప్రతి విషయాన్ని గుర్తుంచుకోవడమే స్మృతి అంటారు. విషయాలను సేకరించేది మనసే, గుర్తుంచుకునేదీ మనసే, ఆ గుర్తుంచుకునే స్థితినే స్మృతి అంటారు.

మీరు గమనిస్తే చిన్నతనంలో జరిగిన విషయాలు, నేర్చుకున్న విషయాలు, కంఠస్థం చేసిన పద్యాలు, ఎక్కాలు బాగా గుర్తుండిపోతాయి. ఎందుకంటే అప్పుడు మీ మనసు బాహ్య విషయాలపై ఉండదు. ఎవరి గురించి ఆలోచించరు, కాబట్టి మనసుకు ఏకాగ్రత ఎక్కువగా ఉంటుంది. స్మృతిలో నుండే స్పృహ, ఎరుక వస్తుంది.

బాహ్య విషయాల మీద చింత లేకుండా ఆధ్యాత్మిక పుస్తకాలు చదివినా, విన్నా, గురువుల ద్వారా ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకున్నా అవి మీ స్మృతిలో ఉండిపోతాయి. కానీ మీ చుట్టూ నలుగురు ఉన్నప్పుడు మీరు పుస్తకాలు చదివినా, మీ దృష్టి ప్రక్కవాడి మీద ఉంటుంది కానీ మీరు చదివే విషయాలు మీద ఉండదు, అందుకే అవి మీ స్మృతిలో ఉండవు, అంత గుర్తు ఉండవు.

అంటే మీరు ఏకాగ్రతతో చదివిన విషయాలు మాత్రమే మీ స్మృతిలో ఉండిపోతాయి అంటే జ్ఞాపకాల్లో ఉండిపోతాయి. అందుకే గురువు చెప్పిన విషయాలు ఏకాగ్రతతో వినాలి, అప్పుడు అవి యథాతథంగా మీ లోనికి వెళ్ళి అవి స్మృతిలో ఉండిపోతాయి.

**2) మతి :**

మతి అంటే జరగబోయే విషయాల గురించి ఊహించుకోవటం, జరగబోయే విషయాల గురించి ఆలోచించడం.

ఎవరైనా జరగబోయే విషయాల గురించి గాని, జరిగిన విషయాల గురించి గాని మాట్లాడేటప్పుడు వారి మాటల్లో ఎన్నో తప్పులు దొర్లుతుంటాయి. ఎవరైనా ఒక టాపిక్ మాట్లాడుతుంటే మీరు వారితో వేరే టాపిక్ మాట్లాడితే వారి మాటల మీద దృష్టి పెట్టలేదు అని లెక్క. అప్పుడు వారు “నీకు మతి లేదా? నేను ఏం మాట్లాడాను? నువ్వు ఏమి మాట్లాడుతున్నావు?” అని అంటారు. అంటే అప్పుడు మీ మతి వర్తమానంలో లేదని లెక్క.

అలాగే ఎప్పుడో జరిగిన విషయాలను గుర్తు తెచ్చుకొని భాధ పడటం, జరగబోయే విషయాల గురించి ఆలోచించి భయపడటం ఇలాంటి మానసిక స్థితిలో మీరు ఉంటారు.

ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన మీరు వర్తమానంలోనే జీవించాలి. వర్తమానంలో మీరు సరిగ్గా ఉంటే మీ భవిష్యత్ ఎప్పుడూ బాగుంటుంది అని సద్గురువులు చెబుతారు.

అందుకే జరిగిపోయిన విషయాల గురించి ఆలోచించవద్దు, జరగబోయే విషయాల గురించి ఊహాగానాలు ఎప్పుడు చేయవద్దు. వర్తమానంలో జీవించ గలిగే మానసిక స్థితిని తెచ్చుకోండి. అప్పుడు మీ మతి సరిగ్గా ఉంటుంది, వర్తమానంలోనే జీవిస్తారు.

అలా వర్తమానంలో జీవించాలంటే? పత్రీజీ బోధించిన “శ్వాస మీద ధ్యాస” ధ్యానం తీవ్రంగా చేయాలి.

**3) బుద్ధి :**

మీ జీవితంలో జరిగే ప్రతి విషయాన్ని బాగా ఆలోచించి నిర్ణయం తీసుకునేది బుద్ధి. వర్తమానంలో జరిగే ప్రతి విషయంలో సరైన నిర్ణయం తీసుకునేది బుద్ధి.

తొందరపాటు ఉన్న వారికి, అహంకారులకు, అజ్ఞానంలో ఉన్నవారికి బుద్ధి సరిగా పనిచేయదు. కొంచెం సావధానంగా ఆలోచిస్తూ, కొంత జ్ఞానం

ఉన్నప్పుడు, పూర్వ జన్మ వాసనలు, కర్మలు, సంస్కారాలు మంచివి అయినప్పుడు మీ బుద్ధి మంచి నిర్ణయాలు తీసుకుంటుంది. అంతేకాదు బుద్ధి బాగా పని చేస్తే లోకకళ్యాణ కరమైన పనులు చేస్తారు.

అలాగే పశు పక్షాదులకు కూడా బుద్ధి ఉంటుంది, కానీ అవి బుద్ధిని ఎక్కువగా ఉపయోగించవు. అవి ఆహార సంపాదన కొసం, ఏమైనా ప్రమాదాలు సంభవించినప్పుడు మాత్రం బుద్ధిని ఉపయోగిస్తాయి. అవి చిన్నపాటి బుద్ధి స్థితిలో ఉంటాయి కాబట్టి ఈ రెండు విషయాల్లోనే బుద్ధిని ఉపయోగిస్తాయి.

కానీ మానవుడు  బుద్ధి కలిగి ఉంటాడు. కాని పూర్తి స్థాయిలో వినియోగించడు, కారణం తీసుకునే ఆహారం, చేసే వ్యవహారం. అందుకే తప్పుడు పనులు చేసినప్పుడు, తప్పుడు నిర్ణయాలు తీసుకున్నప్పుడు నీకు బుద్ధి లేదా? అని తిడతారు.

మీరు గమనిస్తే కొంత మంది ఎదుటి వాడు ఎలాంటి వాడో తెలుసుకోకుండా తొందరపడి నిందలు వేస్తారు. ఆ తర్వాత వాడి గురించి తెలుసుకొని “నా బుద్ధి తక్కువై అలా ప్రవర్తించాను నన్ను క్షమించు” అని అంటాడు.

మీ కర్మలు మంచివి అయినప్పుడు లోకకళ్యాణకరమైన పనులు చేస్తారు, ఎదుటివారి మీద నిందలు వేయరు అప్పుడు మీ బుద్ధి సక్రమంగా పనిచేస్తుంది.

ఇటువంటి వారు ఎప్పుడు ప్రక్కవాడు సహాయం చేస్తాడా? లేదా? అని ఆలోచించడు. వారి బుద్ధి ఎప్పుడు ప్రక్కవాడిని బాగు చేయాలి అని ఉంటుంది. అలాంటి వారు చేసే పనులలో ప్రకృతి సహకారం కూడా ఉంటుంది.

మీరు మంచి పనులు చేసినప్పుడు మీ బుద్ధి సద్బుద్ధి అవుతుంది. ఎదుటి వాడిని హింసించే పనులు, కష్టపెట్టే పనులు చేస్తే మీ బుద్ధి దుష్ట

బుద్ధి అవుతుంది. ఎందుకంటే పరులను హింసించేవారు రాక్షసులు, పరులకు మేలు చేసేవారు దేవతలు. "దేవతల బుద్ధి సద్బుద్ధి, రాక్షసుల బుద్ధి దుష్ట బుద్ధి". ఇద్దరికి బుద్ధి ఉంది కానీ దాన్ని ఉపయోగించుకునే విధానాన్ని బట్టి అది సద్బుద్ధా? దుష్టబుద్ధా? అన్నది తెలుస్తుంది.

**4) ప్రజ్ఞ :**

మీ జీవితంలోకి ఒక సద్గురువు వచ్చి ఆ భగవంతుడు ఎవరు? ఆయనను ఎలా తెలుసుకోవాలి? అనే విషయాలు బోధించినప్పుడు బాహ్యంగా తిరిగిన మీమనసు అంతర్ముఖం అవుతుంది.

మీ మనసుకు ఎప్పుడూ బాహ్య విషయాల సేకరణే ఉంటుంది. ఈ బాహ్య విషయాలు సేకరించడం వల్ల ఎక్కువగా ఆందోళనలు, ఆవేశము, అశాంతి, అహంకారం, అజ్ఞానం ఉంటుంది. మరి అంతుర్ముఖమైన మనసు శాంతిగా, స్థిమితంగా, నిదానంగా ఆలోచిస్తూ ఉంటుంది.

అందుకే ఇప్పుడు డాక్టర్లు కూడా టెన్షన్‌లో, డిప్రెషన్ లో ఉన్నవారిని ధ్యానం చేయమని చెబుతున్నారు. ఎన్ని మందులు వాడినా మనిషికి శాంతి రాదు, ధ్యానం చేస్తే మనసుకు శాంతి ఉంటుంది. ఆ సృష్టికర్తకి ధ్యానం ఎప్పుడు ఇవ్వాలో తెలుసు. అందుకే ఎప్పుడో ద్వాపరయుగంలో పూర్తిగా అడుగంటిపోయిన ధ్యానం, ఇప్పుడు మరల కలియుగంలో పత్రి గారు వచ్చిన దగ్గర నుంచి  మానవులు చేస్తున్నారు.  పత్రి గారి వల్ల ధ్యానం విశిష్టత, ధ్యానం యొక్క ఆవశ్యకత  తెలుసుకొని ధ్యానం చేస్తూ మనసుకు ఉన్న ఆందోళనలు, ఆవేశాలు, అహంకారాలు తగ్గించుకుంటున్నారు.

బాహ్యంగా చూస్తే అహంకారం వస్తుంది, అంతరంలోకి వెళ్ళినప్పుడు ఆనందం వస్తుంది. చూడండి ఈ బాహ్య ప్రపంచంలో ఏ చిన్న గొప్ప పని చేసినా గొప్ప విద్య కలిగి ఉన్నా, అందం కలిగి ఉన్నా, సంపదలు ఉన్నా, పదవులున్నా అహంకారం పెరుగుతుంది. పరమాత్మ సృష్టించిన సృష్టిని చూసి

నాది అనే మిథ్య జ్ఞానంతో అహంకారాన్ని పెంచుకుంటారు.

ఈ సృష్టిలో ఉండేవి ఏది నాది కాదు అన్నీ ఆ భగవంతుడివే అని తెలుసుకున్న క్షణం నుంచి అంతరంలోకి వెళ్ళి మీ గమ్యం ఏమిటి? మీ లక్ష్యం ఏమిటి? ఈ భూమ్మీద  సాధించవలసింది ఏమిటి? అని మీరు తెలుసుకుంటారు.

అంతేకాదు ఒక సద్గురువును పొందినప్పుడు ఆయన మాటలు ఆ పరమాత్మ వాక్కులా స్వీకరించి ఆయన చెప్పిన సాధన చేసినప్పుడు మీలో నుండి ప్రజ్ఞ బయటకు వస్తుంది.

ఈ ఆధ్యాత్మిక జీవితంలోకి ప్రవేశించినప్పటి నుండి ఆత్మనుండి సంకేతాలు అందుతూనే ఉంటాయి. అందుకే మీ జీవితంలోకి గురువు రాకపోతే సత్యం బోధపడేది కాదు. సత్యం తెలియకపోతే ధర్మాన్ని ఆచరించలేరు, సత్యం, ధర్మం లేకపోతే జ్ఞానం పెరగదు. ఇలా ఈ మూడు మీ జీవితంలోకి వచ్చినప్పుడు మీ ఆత్మనుండి ప్రజ్ఞ మనసుకు అందుతుంది.

అందుకే ఈ ధ్యాన మార్గంలోకి వచ్చినవారు ఒకలా ఆలోచిస్తే, ఈ ప్రపంచంలో ఉన్న వారందరూ ఇంకొక లాగా ఆలోచిస్తున్నారు. పదవులు పొందినా, డిగ్రీలు సంపాదించినా, డబ్బు వచ్చినా అంతా నా కృషి వల్లే వచ్చింది అని అనుకుంటారు.

కానీ ఒక జ్ఞాని అంతా భగవంతుడి వల్లే వచ్చింది అనుకుంటాడు. అంటే ఆ భగవంతుడి దయవల్ల ఆయన కృప వల్ల నేను అన్నీ పొందుతున్నాను అని, నా వెనకాల ఆ పరమాత్మ కృప ఉంది అని అనుకుంటాడు. మీరు ప్రకృతికి, గురువుకి, పరమాత్మ కి గౌరవం ఇచ్చినప్పుడు మీ ఆత్మనుండి ప్రజ్ఞ అందుతుంది. అప్పుడు మనసు ఎంతో జ్ఞానాన్ని నింపుకుంటుంది అంటే ప్రజ్ఞ నుండి మీకు జ్ఞానం అందుతుంది అని అర్థం, అంతే కానీ శ్రవణం, స్వాధ్యాయం ద్వారా  వచ్చేది చాలా స్వల్ప  జ్ఞానం. కానీ పూర్తి జ్ఞానం ప్రజ్ఞ

నుండే పొందగలుగుతారు.

**5) ప్రతిభ :**

ప్రతిభ ప్రజ్ఞ కంటే గొప్పది. ఎవరైతే తీవ్రాతి తీవ్రమైన ధ్యాన సాధన చేస్తారో వారి మీద భగవంతుని కృప కలిగి, అంటే ఆ దైవానుగ్రహం వల్ల ప్రతిభ వస్తుంది.

మీరు గమనిస్తే గొప్ప మహాత్ముడైన రత్నాకరుడు వాల్మీకిగా మారి రామాయణ మహాకావ్యాన్నే వ్రాశాడు. అలాగే కాళిదాసు, వ్యాసుడు, శంకరాచార్యులు, మలయాళ స్వామి అనే వీళ్ళంతా సాధన చేసి దైవానుగ్రహం వల్ల వాళ్ళలో ప్రతిభను బయటపెట్టి ఎన్నో గ్రంథాలు, ఎన్నో శాస్త్రాలు మనకు అందించారు అంటే ఎంత ప్రతిభ వారిలో ఉండాలి? ఎంత మేదస్సు ఉండాలి? ఆలోచించండి? అంటే వారి మనసు ఎంత గొప్పగా శుద్ధత్వం పొందిందో తెలుసుకోవచ్చు.

పరమాత్మ కృప ఉన్నవాళ్లకు ఈ ప్రతిభ బయటకి వస్తుంది. రాఘవరావు గారు అన్ని పుస్తకాలు వ్రాయగలిగారు అంటే మొదట్లో ఆయనలో ఉండే ప్రజ్ఞ పత్రీజీ పరిచయం అయిన తర్వాత సాధన పెరగగా, పెరగగా లోక కళ్యాణకరమైన పనులు చేస్తూ, ఇంకా ఏం చేయాలి? ఈ జ్ఞానం అందరిలో ఎలా పెంచాలి? అని నిరంతరం తపన పడుతున్నారు. అందరిలో ఆత్మ అనే భగవంతుడు ఉన్నాడు, ఆత్మ అనే భగవంతుడికి ధ్యానం అనే నీరు పోస్తే ఆ శక్తి పెరిగి ఆ ప్రజ్ఞ ప్రతిభగా మారుతుంది అని తెలుసుకుని, అందరికి బోధిస్తున్నారు. రాఘవరావు గారిలో ఎప్పుడైతే ఆ ప్రజ్ఞ ప్రతిభగా మారిందో ఎన్నో పుస్తకాలు వ్రాయగలుగుతున్నారు.

ఉదాహరణకు మనం వర్తమాన కళాకారులు తీసుకుంటే నాట్యం, చిత్రలేఖనం, సంగీతం లాంటి ఎన్నో రంగాలలో రకరకాల కళాకారులు ఉంటారు. వారందరూ కూడా గత జన్మలలో ఎంతో కొంత ఆ కళ సాధన

చేసిన వారే. అందుకే వారు ఈ జన్మలో కూడా కృషి చేసి వారిలోని ప్రతిభను చూపించ గలుగుతున్నారు.

కానీ వారు అదే కాకుండా ఇంకా ఈ ధ్యానం సాధన చేస్తే ఒక కాళిదాసు లాగా, వాల్మీకి లాగా, వ్యాస భగవానుడు లాగా, శంకరాచార్యుడు లాగా ఇలా గొప్ప గొప్పగా ఎన్నో కావ్యాలు వ్రాసి ఆ జ్ఞానాన్ని ప్రజలకి అందిస్తారు.

వాళ్ళు కొద్దిపాటి ప్రతిభను ప్రదర్శిస్తున్నారు అంటే ఏదో ఒక కళలోనే రాణిస్తున్నారు. కానీ ఒక శంకరాచార్యులు కానీ, కాళిదాసు కానీ, ఒక వాల్మీకి కానీ లోక కళ్యాణం కోసం సేవ చేస్తూ ఎన్నో మహా కావ్యాల ద్వారా ఎంతో జ్ఞానాన్ని ప్రజలకు అందించడం జరిగింది, అది చదివి ఎంతో మంది జ్ఞానవంతులయ్యారు.

మరి వీరందరిపై దైవం యొక్క కృప ఉండ బట్టే వీళ్ళ ప్రతిభ అంతగా విస్తరించింది. ఈ భూమ్మీద అన్ని జీవుల కంటే మానవుడు గొప్పవాడు, మనసు ప్రభావంతో జీవించేవాడు కానీ ఆ మనసుని ప్రాపంచిక వ్యవహారాల మీద తిప్పి ఉంచితే స్వార్థంతో బ్రతికేస్తూ, స్వార్థం తోటే ఉంటూ, పరిమితంగా నేర్చుకొని చనిపోతారు. కానీ అలాంటి మనసును సాధనలో ఆత్మవైపు ఉంచితే బుద్ధి వికసింప చేసుకొని ప్రజ్ఞ పొందుతూ, జ్ఞాన వంతులవుతారు.

మీరు ప్రాపంచిక జీవితమే జీవిస్తూ, ఆధ్యాత్మిక జీవితం లేకపోతే సగం జీవితమే జీవించినట్లు, పూర్ణ పురుషులు కాలేరు.

ఎంతో మంది భూమిమీద పుడుతున్నారు, పెరుగుతున్నారు, అనుభవిస్తున్నారు, చనిపోతున్నారు. కాని వారెవరూ పూర్ణ పురుషులు కాలేరు, కానీ ఎవరైతే ప్రపంచంలోకి వచ్చి ప్రాపంచిక జీవితం అనుభవించి దాంతో పాటు ఆధ్యాత్మిక జీవితం కూడా అనుభవిస్తారో వారే పూర్ణపురుషులు అవుతారు.

పత్రిగారు ఎంతో మందికి జ్ఞానం నేర్పారు, మరి అందరిలోని ప్రతిభ

బయటకి వచ్చిందా అంటే వాళ్ళ వాళ్ళ కృషిని బట్టే ఉంటుంది. నేను ఎదగాలి అన్న తపన వారిలో ఉండాలి. నేనే కాదు నాతోటి వారంతా ఆత్మ స్వరూపులే కాబట్టి అందరినీ ఉద్ధరించగలగాలి, నాకు చేతనైనంత వరకు అని ఏ వ్యక్తి అయితే కోరుకుంటాడో మనస్ఫూర్తిగా, అలాంటి వారికి ప్రకృతి సహకారం ఉంటుంది.

"నేనే బాగుపడలేదు ప్రక్కవాడిని ఏం బాగు చేస్తాను" అని చాలామంది అనుకుంటారు. నువ్వు బాగుపడ్డావా? లేదా? కాదు ప్రక్కవాడు బాగున్నప్పుడు నువ్వు ఇంకా బాగుంటావు. సృష్టిలో ఉన్న భగవంతుని ధర్మం, నీకు వచ్చింది ఇవ్వడమే.

అందుకే పత్రిగారు జ్ఞానం నువ్వు ఎంత నేర్చుకుంటే అంత చెప్పు అన్నారు. అంతకంటే ఎక్స్ట్రాలు చెప్పమన లేదు. నువ్వు ఎంత నేర్చుకున్నావు, అందరూ ఆత్మ స్వరూపులని  అదే నేర్పు. ఏ జీవి కూడా ఆత్మ స్వరూపం కాకుండా లేదు, అన్ని ఆత్మలే అందుకే ఏ జీవిని చంపే హక్కు నీకు లేదు.

ఈ పరమ సత్యాన్ని చెప్పడానికి డిగ్రీలు అవసరం లేదు, వర్తమానంలో జరుగుతున్నదే నువ్వు చెప్పు. ఎందుకు అంటే అజ్ఞానంలో ఉన్న మానవుడు జీవహింస చేస్తున్నాడు. ఆ జీవులంతా నాకోసం పుట్టాయి అనుకుంటున్నాడు కానీ ఎవరికోసం ఏ జీవి పుట్టదు. ప్రతిజీవి తనని తాను ఉద్ధరించుకోవడానికి 84 లక్షల జీవరాశులుగా జన్మలు తీసుకుని అనుభవాలు నేర్చుకుంటూ, పాఠాలు నేర్చుకుంటూ మానవ జన్మలో వచ్చాక తానెవరు? తాను ఎక్కడి నుంచి వచ్చాను? ఎక్కడికి వెళ్ళాలి? వెళ్ళడానికి భూమిమీద ఏం చేయాలి? అనే పాఠాలు గురువు ద్వారా నేర్చుకొని ఆ విధంగా ప్రయాణం చేసినప్పుడు  ఈ ఆత్మకి ముక్తి, మోక్షం. అంటే ఇంక జన్మ తీసుకునే అవసరం లేదు అని తెలుసుకుని అదే బోధించాలి.

ఈ సత్యం బోధించడానికి మీ దేహాన్ని భగవంతుడు ఎన్నుకున్నాడు

అని సంతోషంతో ఈ పని మీరు చేయగలగాలి. అలా చేసినప్పుడు పరమాత్మే మీకు కావాల్సినంత శక్తిని ఇస్తాడు. నిత్యం సాధన చేయకుండా ఎదుటివాడికి చెప్పే అర్హత మీకు లేదని గమనించండి, ఆచరించకుండా చేసేవాడు ఆచార్యుడు కాదు. ఆచరించి చూపినవాడే ఆచార్యుడు. కాబట్టి గురువు దగ్గర విద్యని నేర్చుకొని, ఆచరించి అది 10 మంది చేత ఆచరింపచేయాలి.

అలా మీరు చేసే ప్రయాణంలో ఏ అడ్డంకులు లేకుండా నిరంతరం చూస్తూ ఉంటాడు ఆ పరమాత్మ. అందుకే మీలోని ప్రతిభను గుర్తించి దాన్ని వెలికి తీసే మార్గమే ధ్యానం. ప్రతిఒక్కరిలో అనంతమైన శక్తి ఉంది దాన్ని వెలికితీసే మార్గమే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ఇది తప్ప వేరేది లేదు.

మీ మనసు బాహ్యంలో తిరిగినప్పుడు సంకుచితత్వంతో ఉంటుంది, అంతరంలోకి వెళ్ళినప్పుడు విశాలత్వం పొందుతుంది. అంటే అందరికీ సహాయం చేయాలి, అందరిని జ్ఞానవంతులను చేయాలి అని కోరిక ఉన్న మనసు చాలా గొప్ప మనసు. అటువంటి మనస్తత్వాన్ని అలవాటు చేసుకుంటూ అందరూ బాగుండాలి అనే కోరిక ప్రతి ఒక్కరికి ఉండాలి.

అందుకే మన మనసు ఈ పంచావస్థలో ఉంటే మొట్టమొదట మన కోసమే మనం అన్నట్టుగా బ్రతుకుతాం, చిట్టచివరికి అందరి కోసమే ఈ దేహం తీసుకున్నాను అని అర్థమవుతుంది. అలా అర్థమైనప్పుడే ఆనందకరమైన జీవితం జీవించడానికి అవకాశం ఉంటుంది.

# ఆధ్యాత్మికంలోకి వచ్చినవారి జీవితం ఎలా ఉండాలి?

ప్రతి మానవుడికి ప్రాపంచిక జీవితం, ఆధ్యాత్మిక జీవితం రెండు ఉంటాయి. కానీ కొంతమంది మానవులు ప్రాపంచిక జీవితమే శాశ్వతం అనుకుంటారు. ఇలాంటి వాళ్ళు ఎప్పుడూ చింతలో ఉండి వారి జీవితాన్ని వ్యర్థం చేసుకుంటారు. భోగాల వెనక, డబ్బు వెనక, పదవుల వెనక పడుతూ జీవితమంతా చింతలోనే ఉంటారు. అలా జీవితాన్ని పూర్తి చేసుకుని, ఏమి సాధించలేక వెళ్ళిపోతూ ఉంటారు.

మరి ఆ ప్రాపంచిక జీవితం నుంచి ఆధ్యాత్మిక జీవితంలోకి రావాలంటే వారు ఎంతో పుణ్యం,  ఎన్నో సత్కర్మలు చేస్తే కానీ ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగు పెట్టలేరు. మరి ఇంతటి అపురూపమైన జీవితం, దివ్యమైన జీవితం మీకు వచ్చింది కాబట్టి మీరు ఎంతో అదృష్టవంతులు. మానవ జన్మ యొక్క జీవిత పరమార్థం ఈ దేహం ఉండగానే ఈ దేహాన్ని సృష్టించిన వాడిని దర్శించటం, అప్పుడే మోక్షం వస్తుంది.

ఈ ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నవాళ్లు అంటే ఈ దివ్య జీవితంలో ఉన్నవాళ్లు ఎప్పుడూ దివ్య చింతనలో ఉంటారు. దివ్య చింతన అంటే గొప్ప ఆలోచన, గొప్ప ఆలోచన అంటే ఈ పరమాత్మ కంటే గొప్పది ఈ సృష్టిలో ఏది లేదని. కాబట్టి ఆయన్ని ఎలా తెలుసుకోవాలి? ఎలా చేరుకోవాలి? అన్న ఆలోచన.

ఆయనను ఈ దేహం ఉండగానే దర్శించుకోగలిగితే మోక్షం వస్తుందని గురువుల ద్వారా తెలుసుకుంటారు. అందుకే వారి  దృష్టి పరమాత్మ మీదే ఉంటుంది. ఆ పరమాత్మని ఎలా చేరుకోవాలనే ఆలోచనతోనే ఉంటారు. వారెప్పుడు వర్తమానంలోనే జీవిస్తూ ఉంటారు, వారి ఆలోచనలు కూడా వర్తమానంలోనే ఉంటాయి, ఎప్పుడు పాజిటివ్ థింకింగ్ లో ఉంటారు.

జీవితంలో ఏం జరిగినా అంతా నా మంచికి అని అనుకుంటారు.

మరి ఈ దివ్య జీవితం జీవిస్తున్న మానవులను దివ్య మానవులు అని అనుకోవచ్చు, ఎందుకంటే వీళ్ళు పరమాత్మ కోసం సాధన చేస్తున్నారు కాబట్టి. అయితే వీళ్ళు ఎలా ఆలోచిస్తారు అంటే "నేను ఈ భూమ్మీదకి వచ్చేటప్పటికి పంచభూతాల ద్వారా, ప్రకృతి ద్వారా ఆ భగవంతుడు అన్నీ నాకు అమర్చి పెట్టాడు, నాకు కావలసినవి అన్నీ ఈ భూమ్మీద ఉన్నాయి, దేని కోసం నేను వెతుక్కోనక్కరలేదు" అని తెలుసుకుంటారు.

మరి మానవుడికి శరీరం ఉంది కాబట్టి ప్రతిరోజూ ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది, కాబట్టి ఈ భూమ్మీద పుట్టక ముందే మన కోసం ఆహారం సృష్టి చేయబడి ఉంటుంది. మరి సాధన చేస్తున్నవారు ఈ ఏర్పాట్లన్ని భగవంతుడు తన కోసం చేశాడు అని కృతజ్ఞతా భావంతో ఉంటారు. రోజు మీరు భోజనం చేసేటప్పుడు ఆ భగవంతునికి కృతజ్ఞత చెప్పుకుంటూ భోజనం చేయాలి. ఈ శరీరాన్ని కాపాడటానికి ఆహారాన్నిచ్చి, సాధనకి అనుకూలంగా ఈ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతున్న ఆ భగవంతుడికి ప్రతిరోజు కృతజ్ఞత చెప్పుకుంటూ ఉండాలి.

సాధన చేస్తున్న మీరు ఎప్పుడు తృప్తితో జీవించాలి, అంటే ఎటువంటి చింత లేకుండా సాధన చేయాలి. చింతలో ఉన్నవాడికి ఎప్పుడు సాధన కుదరదు కాబట్టి సాధన చేస్తున్నా మీరు ఎప్పుడు తృప్తితో జీవించాలి, చింత లేకుండా సాధన చేయాలి, మౌనంగా ఉండాలి, జ్ఞానం పెంచుకోవాలనే తపనతో ఉండాలి. చింతలో ఉన్నవాడికి ఎప్పుడూ సాధన కుదరదు, ఎప్పుడు కుదురుతుంది అంటే ఉన్నది చాలు అని అనుకుంటే సాధన బాగా కుదురుతుంది.

అందుకని మౌనం, తపస్సు, స్వాధ్యాయము అనేవి చాలా ముఖ్యం. తపస్సు అంటే ప్రాపంచిక అవసరాలను తగ్గించుకోవటం. ప్రాపంచిక కోరికలు

ఎంతగా పెరిగితే మనిషి అంతగా దిగజారిపోతాడు. ఎందుకు అంటే ప్రాపంచిక కోరికలు ఒక దాని తర్వాత ఒకటి నిరంతరం అలా పుడుతూనే ఉంటాయి. అలా ప్రాపంచిక కోరికల గురించి ప్రయత్నించినప్పుడు సాధనలో పురోగతి ఉండదు. అందుకే మౌనంగా ఉండడం మొట్టమొదటి పని అయితే, తపస్సు అంటే ప్రాపంచిక అవసరాలు తగ్గించుకుంటూ ఉండడం, ఏకాంత వాసానికి ఇష్టపడటం.

సాధకుడు ఎందుకు ఎక్కువ ఏకాంత వాసంలో ఉండాలి అంటే ప్రక్కవాడి వల్ల నీ మనసు చంచల స్థితికిపోతుంది కాబట్టి. నువ్వు మళ్ళీ చింతలో కూరుకుపోతావు కాబట్టి ఎక్కువ ఏకాంతవాసానికి ఇష్టపడాలి.

జ్ఞానం ద్వారా నువ్వు పది మందికి ఉపయోగపడాలి, నీ జ్ఞానం పది మందికి ఉపయోగపడినప్పుడే నువ్వు మహాత్ముడు అవుతావు.

మీ దగ్గర జ్ఞానం ఉన్నప్పుడు, అది అందరికీ పంచినప్పుడు ప్రజలందరూ మీకు ఆకర్షితులు అవుతారు. ధనం వల్ల కానీ, రూపం వల్ల కానీ, పదవులు వల్ల కానీ కొంతకాలమే ఆకర్షితులు అవుతారు.

మీ దగ్గర ధనం ఉన్నప్పుడు కొంతకాలం ఆకర్షితులు అవుతారు. వాడు ఎంతో ధనవంతుడు కదా! అని, మరి పదవులు ఉన్నప్పుడు కూడా ఆ పదవి ఉన్నంత కాలం ఆకర్షితులు అవుతారు ఆ పదవి పోగానే మిమ్మల్ని పట్టించుకోరు, అలానే ఒక సినిమా యాక్టర్ వయసులో ఉన్నప్పుడు, అందంగా ఉన్నప్పుడు ఎంతో మంది వారిని చూడటానికి ఇష్టపడతారు కానీ వారు ముసలివారైన తర్వాత వారి ముఖం కూడా చూడరు. కానీ ఒక జ్ఞానికి ఉండే ఆకర్షణ నిత్యం వెలుగుతుండే దీపం వంటిదే, ఆ దీపం ఎలా వెలుగుని ఇస్తుందో అలానే ఆ జ్ఞాని తన జ్ఞానాన్ని అందరికి పంచుతూ ఉంటాడు. ఈ సృష్టిలో ఉన్న రహస్యం ఏమిటి? అంటే పంచితే పెంచబడుతుంది, దానం చేస్తే తరగకుండా ఉంటుంది. ప్రాపంచిక జ్ఞానం కానీ, ఆధ్యాత్మిక జ్ఞానం

కానీ పంచితే పెంచబడుతుంది. అందుకే ఒక జ్ఞాని ఎప్పుడు సాధన చేసుకుంటూ తన జ్ఞానాన్ని పెంచుకుంటాడు. పెంచుకున్న జ్ఞానాన్ని కూడా పంచుతాడు. అందుకే పత్రి గారు ఎప్పుడు కూడా పంచితే పెంచబడుతుంది, దాచుకుంటే దోచుకోబడుతుంది, అది ఎందుకు పనికి రాదు అనేవారు.

అందుకే ప్రవహించే నదిలో నీళ్ళు ఎప్పుడూ శుభ్రంగా ఉంటాయి. అలాగే మన ఇంట్లో బావిలో నీటిని ప్రతి రోజు తోడుకుంటే ఆ నీరు స్వచ్ఛంగా ఉంటాయి. కానీ ఎవరిని తోడుకోనివ్వకుండా ఉంటే ఆ నీరు కొన్ని రోజులకు చెడిపోతుంది. అలాగే మీరు జీవితమంతా కష్టపడి సంపాదించి దాచుకున్న ధనం అంతా మీ పిల్లలు దోచుకుంటారు, మీకు ఏవైనా పదవులు ఉంటే ప్రక్కవాడు దోచుకుంటాడు, కానీ నీకు ఉన్న జ్ఞానం మాత్రం ఎవరూ దోచుకోలేరు.

వశిష్టుల వారు అన్నిటికంటే మానవులకి మూడు మదాలు ఎక్కువ అంటారు. అవి రూప మదం, ధన మదం, విద్యా మదం.

రూపమదం అంటే నేను అందగత్తెని, నేను అందంగా ఉంటాను అనేది రూప మదం. అయితే నేను బాగా చదువుతాను, నాకు ఎన్నో డిగ్రీలు ఉన్నాయి అనేది విద్యా మదం. కానీ ఈ కలియుగంలో విద్యా మదం కంటే పదవుల మీద ఆసక్తి ఎక్కువగా ఉండటం వల్ల పదవీ మదం కూడా ఉందని చెప్పుకోవచ్చు. అలాగే నేను బాగా డబ్బున్న వాడిని, కోటీశ్వరుడిని అనే ధన మదం కొంతమంది కలిగి ఉంటారు.

కానీ జ్ఞానం ఉన్నవాడు ఎప్పుడూ గౌరవించబడతాడు అందుకే జ్ఞానాన్ని వెలుగుతో, అజ్ఞానాన్ని చీకటితో పోల్చారు. ఒక గదికి 100 సంవత్సరాలు తలుపులు వేసి ఉంచినా చీకటిగానే ఉంటుంది కానీ ఆ గదిలో చీకటిని పోగొట్టాలి అంటే ఆ గదిలో ఒక లైట్ వేస్తే ఆ గదిలో ఉన్న చీకటిని అంతా పోగొట్టవచ్చు అలానే మీలో ఉన్న అజ్ఞానాన్ని ఒక సద్గురువు మాత్రమే

పోగొట్టగలడు. మీలో ఉన్న జన్మజన్మల అజ్ఞానం తొలగాలి అంటే ఒక సద్గురువును ఆశ్రయించాలి.

అజ్ఞానం అంటే ప్రపంచం శాశ్వతం, శరీరం శాశ్వతం అనుకోవడం. జ్ఞానం అంటే ఈ ప్రపంచము నశించిపోతుంది, శరీరము నశించిపోతుంది, ఆత్మ నశించదు. నేను ఆత్మను, పరమాత్మ నుంచి వచ్చిన అంశాత్మను. నేను కూడా పరమాత్మ స్థాయికి వెళ్ళగలను అని తెలుసుకోవడమే జ్ఞానం.

ఈ జ్ఞానం పొందినప్పుడు వెంటనే నీ అజ్ఞానం పోతుంది అజ్ఞానం ఉన్నంత సేపు చింత. "నేను దేహం కాదు నేను ఆత్మను" అని సాధన ద్వారా అనుభవపూర్వకంగా తెలుసుకున్న రోజు ఆత్మలో ఉన్న అనంతమైన జ్ఞానం అనుభూతి చెందుతావు. నువ్వు చింతలో ఉండకూడదు ఆత్మ చింతనలో ఉండాలి అని పదే పదే గురువులు చెబుతూ ఉంటారు.

అందుకే మనం ఎప్పుడూ కూడా అజ్ఞాని యొక్క లక్షణం ఎలా ఉంది? సాధకుడు యొక్క లక్షణం ఎలా ఉంది? ప్రాపంచిక జీవితంలో ఉన్నవాడి ఆలోచనలు ఎలా ఉన్నాయి? ఆధ్యాత్మిక జీవితంలో సాధకుడు ఆలోచనలు ఎలా ఉన్నాయి? ప్రాపంచిక జీవితంలో ఉన్నవాడు ఎంత ఆనందంగా జీవిస్తున్నాడు? జ్ఞానాన్ని సంపాదించిన వాడు ఎంత ఆనందంగా జీవిస్తున్నాడు? అన్నది విచారణ చేస్తే తెలుస్తుంది.

జ్ఞానం ఉన్నవాడు పరమాత్మ చింతనలో ఉంటాడు. ఎంతో ఆనందంగా ఉంటాడు. ఎంత నష్టం వచ్చినా కూడా భరించగలిగే స్థాయికి ఎదుగుతాడు, అందుకే ప్రాపంచిక జీవితం చింతతో మొదలై చింతతోనే మరణిస్తాడు ఎందుకు అంటే ఆ జీవితం ఎప్పుడూ తృప్తినివ్వదు.

ఆశతో మరణించేవాడు ఎప్పుడూ చింతలోనే ఉంటాడు, ఆశయం కోసం జీవించేవాడు ఎప్పుడూ కూడా పరమాత్మ చింతనతో తృప్తికరమైన జీవితం అనుభవిస్తాడు.. సాధకుడు ఎప్పుడూ కూడా సాధకుడు లా ఉండడు,

గురువు ఇచ్చే ట్రైనింగ్ ద్వారా ఉన్నతంగా ఎదుగుతూ ఉంటాడు.

సాధన ద్వారా జ్ఞానం పెరిగినప్పుడు అది నీ తోటే ఆగిపోకుండా, నీకు తెలుసున్నదే ప్రక్కవాడికి చెప్పు, నువ్వు ఏ ఆనందాన్ని పొందుతున్నావో ఆ ఆనందాన్ని ఇతరులకు చెప్పు. నువ్వు ఏ సత్యాన్ని తెలుసుకున్నావో ఆ సత్యాన్ని ప్రక్కవాడికి చెప్పు, అని ఎన్నో విషయాలు మనకు పత్రి గారు బోధించారు.

అన్నింటికంటే గొప్ప సత్యం నువ్వు శరీరం కాదు, ఆత్మవి. ఆ సత్యం తెలియక అజ్ఞానంలో ఉన్నారు, ఆ సత్యం తెలిసినప్పుడు అందరూ ఆనందంగా ఉంటారు. ఎందుకంటే భగవంతుడు ఎవరో? తెలియక అందరూ అయోమయంలో ఉన్నారు. భగవంతుడి మీద భక్తి ఉంది, కానీ భగవంతుడు ఎవరో తెలుసుకోలేనంత చింతలో కూరుకుపోయారు.

"ఆత్మే" భగవంతుడు అని సర్వ జీవుల శరీరాల్లో అంతర్యామిగా ఉన్నాడు. ఆ ఆత్మను తెలుసుకునే అర్హత ఒక్క మానవ జన్మ కే ఉంది కాబట్టి అలాంటి అపురూపమైన మానవ జన్మ తీసుకొని సద్గురువు ద్వారా ఏ సాధన చేస్తే నీవు ఆత్మవు అని అనుభూతిని పొందుతావని తెలుసుకున్నావో, ఆ సాధన చేసి నేను ఆత్మను అని అనుభూతిని పొంది ఆ జ్ఞానాన్ని పది మందికి బోధించు అని గురువులు చెబుతారు.

సద్గురువు వచ్చాక మరణం అంటే భయం ఉండదు. పత్రి గారిని ఒక ఇంటర్వ్యూలో మీ తర్వాత శిష్యులు ఎవరు? అంటే నా తర్వాత అందరూ పత్రి గార్లే అని చెప్పారట. అందుకే పత్రి గారు నీ శ్వాసే నీ గురువు అని చెప్పేవారు. నేను ఈ విషయాలు ఎలా చెప్తున్నానో నీవు కూడా ధ్యానం చేసినప్పుడు నీలో ఉన్న జ్ఞానం బయటకు వస్తుంది.

నీవు అనంతమైన జ్ఞానవంతుడివి అవుతావు, అనంతమైన ప్రజ్ఞావంతుడివి అవుతావు, బ్రహ్మజ్ఞాని అవుతావు అని సింపుల్ సీక్రెట్ "శ్వాస

మీద ధ్యాస" పెట్టు, పొందవలసినంత పొందుతావు, నువ్వు పొందినది పది మందికి పంచమని చెప్పి నిశ్చింతగా  మరణించాడు.

అందుకే రాఘవరావుగారు అందరికి జ్ఞానాన్ని పంచమని చెప్తూ ఉంటారు. మనం చేసే తప్పులను సరి చేస్తూ ఉంటారు. ముందు మనకు తప్పులను ఒప్పుకునే ధైర్యం ఉండాలి. ప్రక్క వాళ్ళు తక్కువ అనుకుంటారేమో అని ఫీలింగ్ ఉండకూడదు, గురువుకి మీ తప్పులు, ఒప్పులు రెండు తెలుస్తాయి. కానీ ఎక్కడ తడబడుతున్నామో  గురువు గమనించి హెచ్చరిస్తూ ఉంటాడు. దానికోసం మీరు బెంగ పెట్టుకోవాల్సిన అవసరం లేదు నన్ను సరి చేస్తున్నాడు నన్ను సరి చేస్తేనే నేను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదుగుతాను అని అనుకోవాలి.

ఎందుకంటే  మీరు ఎదగడానికి, పాఠాలు నేర్చుకోవడానికి భూమ్మీదకి వచ్చారు. ఆ పాఠాలు నేర్చుకోవడానికి మిమ్మల్ని గురువు అనుక్షణం సరిచేస్తూ ఉండాలి. మీరు అనుక్షణం ఎరుకతో ఉండాలి, ఇంకా ఆ పరమాత్మ చింతనలో ఉన్నప్పుడు నిశ్చింతగా మీరు జ్ఞానం పొందుతారు.

సాధకుడి లక్ష్యం ఆ పరమాత్మని పొందటం. ప్రాపంచిక జీవితంలో ఉన్నవాడి లక్ష్యం సుఖాలు, భోగాలు అనుభవించడం. అందుకే నిరంతరం మీరు ఎక్కడున్నారు? ఎలాంటి ఆలోచనలు చేస్తున్నారు? అన్నది తెలుసుకొని మీరు ఏ మార్గంలో ఇంకా ఇంకా ముందుకి వెళ్ళాలి. నేను ఎలాగున్నాను? ప్రాపంచిక చింతలో ఉన్నానా? ఆధ్యాత్మిక చింతనలో ఉన్నానా? అని ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు గమనించుకుంటూ విచారణ చేసుకుంటూ ఉండాలి.

ఉదాహరణకు ఒక మొక్క ఎదగడానికి కారణం దాని వేరే, ఆ వేరు ఎంత బలంగా ఉంటే మొక్క అంత బలంగా ఎదుగుతూ ఉంటుంది.  అలాగే కనిపించే ఈ జీవితానికి కనిపించని ఆత్మే ఆధారం అని తెలుసుకోవాలి. అందుకే గురువు ఇచ్చిన సాధన, సజ్జన సాంగత్యం ఎంత ఎక్కువగా చేస్తారో

అంత గొప్ప జ్ఞానవంతులు అవుతారు, అంత గొప్ప శక్తిమంతులమవుతారు, అందుకే గురు శిష్యుల బంధం మొక్క, వేరు లాంటిది.

ఎంతో సాధన చేసి శక్తిని పొందుతారు, ఆ శక్తిని మీరు వృధా చేసుకోకూడదు. మీకు సంబంధం లేని విషయాలలో తలదూర్చకూడదు. అందుకే మౌనంగా ఉండడం,అక్కర్లేని ఆలోచన లేకుండా చూసుకోవటం, అక్కర్లేని వ్యవహారాలు లేకుండా చూసుకుంటూ సాధన, స్వాధ్యాయం చేస్తుంటే .సాధన వల్ల శక్తిని పొందుతూ. స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం ఈ రెండిటి వల్ల జ్ఞానం పెరుగుతూ ఉంటుంది. ఈ రెండు తప్పనిసరిగా ఉండాలి.

ఇవి పాటిస్తూ చింత లేని జీవితం జీవిస్తూ, నిరంతరం పరమాత్మ చింతనలో ఉంటారు. కాబట్టి ఎప్పుడూ దుఃఖపడకుండా జీవించాలి. ఒకవేళ దుఃఖం వస్తే ఇది నా కర్మ ఫలం, అనుభవిస్తే తీరిపోతుందని, ఆ దుఃఖం లేని జీవితం జీవించడానికి ఆ గురువులే కారణం అని ఆ గురువులకి ఎప్పుడు ధన్యవాదాలు చెప్పుకోవాలి.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

# ప్రాపంచిక జీవితంలో మానవుడు ఎలా ఉంటాడు?

ప్రతి మానవుడు ఎలా జన్మించినా, ఏ కులంలో, ఏ మతంలో జన్మించినా మొట్టమొదట ప్రాపంచిక జీవితాన్నే చూస్తాడు, ఆ తర్వాత ఆధ్యాత్మిక జీవితం లోకి వస్తాడు. కానీ కొంతమంది ఒకే జన్మలో ప్రాపంచిక జీవితం, ఆధ్యాత్మిక జీవితం రెండు అనుభవిస్తారు. అలాంటి వారు ఒకే జన్మలో పూర్ణ పురుషులు కాగలరు. ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చినవారు తృప్తిగా జీవించ గలుగుతారు. ఎటువంటి ఆందోళనలు, ఆవేశాలు లేకుండా, అరిషడ్వర్గాలు అదుపులో ఉంచుకొని, ఆ భగవత్ తత్వాన్ని తెలుసుకొని శాంతిగా జీవిస్తారు. అందుకే "ప్రాపంచిక జీవితం కంటే ఆధ్యాత్మిక జీవితం ఎంతో గొప్పది."

మానవుడు ప్రాపంచిక జీవితంలో ఎలా ఉంటాడు, ఎలాంటి గుణాలు కలిగి ఉంటాడు, ఎలాంటి లక్షణాలు కలిగి ఉంటాడు అనేది ఇప్పుడు చూద్దాం.

ప్రాపంచిక జీవితం అంతా కూడా చింతలతో కూడుకుని ఉంటుంది. ఎందుకు అంటే ఏది సత్యం? ఏది నిత్యం? సుఖం అంటే ఏమిటి? సంతోషం అంటే ఏమిటి? ఆనందం అంటే ఏమిటి? అనే విచారణ లేక ఎప్పుడు చింతలోనే ఉంటారు. దాని నుండి బయట పడాలి అంటే వివేకంతో ఆలోచించ గలగాలి.

మానవుడు ఎంత ధనం సంపాదించినా, ఎన్ని పదవులు ఉన్నా, ఎన్ని డిగ్రీలు సంపాదించినా వాడి జీవితంలో ఏది నిత్యం అనేది తెలియక ఎప్పుడూ చింత లోనే జీవిస్తూ అనిత్యమైన వాటికోసం తాపత్రయ పడుతూ సతమతమై జీవితాన్నంతా వ్యర్థం చేసుకుంటాడు.

ప్రాపంచిక జీవితంలో అందరి దృష్టి ధన సంపాదన మీదే ఉంటుంది. ఆధ్యాత్మిక జీవితంలో కూడా ధనం మీద తాపత్రయం ఉంటుంది కానీ ఈ శరీరం శాశ్వతం కాదు, ఈ ప్రపంచం శాశ్వతం కాదు అని తెలుసుకొని దాని మీద దృష్టి తగ్గిస్తారు. మానవునికి ఉండే కోరికలు ఈ జన్మవి కాదు అవి జన్మ జన్మల సంస్కారాలు. భగవంతుడు అంటే సరైన అవగాహన లేక కోరికలు

తీర్చేవాడు, అన్నీ ఇచ్చేవాడు అని చెప్పి ప్రాపంచిక జీవితంలో ఉన్న వారు. అనుకుంటారు

ఈ ప్రపంచంలో మూడు వంతుల మానవులు ఇలానే ఉన్నారు. ఎంత సంపాదించినా జీవితంలో తృప్తి అనేది లేకుండా జీవిస్తున్నారు. కోరికలు తీర్చమని కోరుతారు, వారి పూర్వ జన్మ సుకృతం వల్ల కానీ, వారి అదృష్టం వల్ల గానీ ఆ కోరిక తీరినా తృప్తి అనేది లేకుండా జీవిస్తుంటారు.

ఈ రకంగా మానవుడు తన అజ్ఞానంతో ఎప్పుడూ ధనం కోసం తాపత్రయ పడుతూ ఉంటాడు. తీరా ధనం సంపాదించిన తర్వాత ఆ సంపదలు ఎక్కడ చేయి దాటిపోతాయని బెంగ పడుతూ, ఆ సంపదే లేకపోతే తన చుట్టూ ఉన్నవారు తనను లోకువగా చూస్తారేమో అని ఆలోచిస్తూ ఉంటాడు. ఆ సంపాదన కోసమే స్నేహాన్ని పోగొట్టుకుంటాడు, బంధుత్వాన్ని పోగొట్టుకుంటాడు అంటే ఎవరిని నమ్మని స్థితిలో దిగజారిపోతాడు.

అలా ధన చింతన ఎంత వరకు ఉంటుందో అప్పటి వరకు దైవ చింతన ఉండదు. వాడు జీవితంలో ఎప్పుడూ వేదనతోనే ఉంటాడు. ప్రపంచ కోరికలు ఎంతగా పెరిగితే అంతగా దిగజారిపోతాడు జీవితం ఎప్పుడూ శాంతి సుఖం ఉండదు.

ప్రతి ఒక్కరికీ డబ్బు అవసరమే కానీ అదే జీవితం కాకూడదు. కానీ మానవుడు డబ్బు వెంట పడుతూ తన శక్తిని అంతా ధన సంపాదన కోసమే వెచ్చిస్తూ తన జీవితాన్ని ధారపోస్తున్నాడు. అనంత శక్తి కలిగిన మానవుడు నశించిపోయే ఈ ప్రపంచాన్నే చూసుకుంటూ అందరూ నన్ను పొగడాలి, శరీరాన్ని సుఖ పెట్టుకోవాలి, బంధువుల్లో తాను గొప్పగా ఉండాలి అని, తన కడుపున పుట్టిన పిల్లలు మహారాజులులా బ్రతకాలి అని ఇలాంటి కోరికలతో నిత్యమూ శాంతి లేకుండా జీవిస్తున్నాడు.

ప్రాపంచిక చింతన ఉన్న మానవుడు కాలం కలిసి రానప్పుడు అంటే

గత జన్మలో వాడికి పుణ్య కర్మలు లేనప్పుడు ఎంత ప్రయత్నించినా వాడికి కలిసి రాదు, అటువంటప్పుడు తాను అనుకున్నది సాధించలేక ఎన్నో దుర్గుణాలకు బానిసై పోతాడు.

మీరు గమనిస్తే కొంతమంది మానవులు వారు అనుకున్నది చేయలేకపోతే వేదన తట్టుకోలేక మద్యానికి బానిసలైపోతుంటారు. అలాంటి వారు వారి ఆరోగ్యం పాడు చేసుకోడమే కాకుండా వాడి సంసారం లోని భార్య, పిల్లలను ఎంతో కష్టపెడతాడు.

భాగవతంలో కూడా మద్యపానం అనేది పాపమే కాదు, మహాపాపం కూడా అని చెప్పారు. ఈ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చినవారు అటువంటి పని చేస్తే ఎంతో పాపం చేసిన వారు అవుతారు.

జీవితంలో కష్టాలు, వేదన తట్టుకోలేక టెన్షన్ పడే వాడిని చూసి వాడి ఫ్రెండ్స్ మద్యపానం తీసుకుంటే బాధలు పోతాయి అని వాడికి అలవాటు చేస్తారు. ఇటువంటి స్నేహితులు ఉంటే వాడు జీవితంలో ఎంతో నష్టపోతాడు. అందుకే సాధకుడికి సజ్జనులతో సాంగత్యం ఉండాలి అని గురువులు ఎప్పుడూ చెబుతూ ఉంటారు. చెడ్డవారితో స్నేహం చేస్తే చెడు అలవాట్లు, చెడు వాసనలు అంటుకుంటాయి.

మీరు గమనించండి కృష్ణుడితో సహవాసం చేసి కష్టాలను కూడా ఓర్చుకుని పాండవులు విజయాన్ని పొందితే, శకునితో సహవాసం చేసి అంత:పురంలో ఉండి కూడా నిద్రపోకుండా, సుఖభోగాలు అనుభవించకుండా ఎప్పుడూ చింతలోనే ఉన్నాడు దుర్యోధనుడు. ధర్మరాజు “బావ నా ప్రక్కన ఉన్నాడు నన్ను కాపాడుకోగలడు? అని నిశ్చింతగా ఉన్నాడు. “సజ్జనులతో సహవాసం మనకు నిశ్చింత, దుర్జనులతో సహవాసం ఎప్పుడూ చింత.”

అసలు చింతకు కారణం ఏంటి? అని ఎవరికి వాళ్ళు విచారణ చేసుకుంటే “నేను ప్రపంచం వైపుకు వెళ్తే చింతలు వస్తున్నాయి, ఎప్పుడైతే

ఉన్నదానితో తృప్తి పడతానో అప్పుడు నాకు నిశ్చింతైన జీవితం వస్తుంది" అని తెలుసుకుంటారు.

"తృప్తి లేని జీవితం ఎప్పుడూ చింతే, తృప్తి ఉన్న జీవితం ఎప్పుడూ నిశ్చింతే". భగవంతుడు ఎవరికి ఎంత ఇవ్వాలో వాళ్ళ గత జన్మ పుణ్యాన్ని బట్టి ఇస్తాడు, కానీ మీరు ఎంత ప్రయత్నించినా, దానికోసం మీ జీవితం వెచ్చించినా ఫలితం రాకపోవచ్చు.

మానవుడి జీవితంలో కష్టం, దుఃఖం ఎందుకు అంటే నేను శరీరం అనుకున్నప్పుడు, ఈ ప్రపంచం శాశ్వతం అనుకున్నప్పుడు ఎప్పుడు భయంతో బ్ర తుకుతారు, లోకం ఏమనుకుంటుందో అనే ఒక భయంతో బ్రతుకుతారు, అంటే మనోస్థితిలో ఉంటారు. బంధాలతో బ్రతుకుతూ, ఎప్పుడు శరీర సుఖాలు కావాలి అదే జీవితం అనుకుని దానికోసం ధనం  సంపాదించడానికి, పదవులు సంపాదించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఆ ప్రయత్నం విఫలమైన రోజున దుర్వ్యసనాలకు బానిసై ఇంకా దుఃఖంలో కూరుకుపోతారు. ఇలా జీవిస్తూ ప్రతి ఒక్కరిని అనుమానిస్తూ ఎంతో వేదన అనుభవిస్తూ ఎప్పుడూ భయంతో బాధతో శాంతి లేకుండా జీవిస్తూ ఉంటారు.

బాగా ధనం సంపాదిస్తే అందరూ నన్ను పొగుడుతారు, అందరూ నన్ను గౌరవిస్తారు అనుకుని ఎదుటి వారికి ఎటువంటి సహాయం చేయకుండా జీవిస్తూ చివరకు వార్ధక్యం వచ్చాక కొంత కాలానికి చనిపోతాడు. తన చుట్టూ ఉండే బంధువులు కానీ, స్నేహితులు కానీ ఏమంటారు అంటే "జీవితమంతా ఎంతో తపన పడి సంపాదించాడు, వెళ్తూ వెళ్తూ ఏమన్నా పట్టుకెళ్ళాడా? అంటే లేదు, ధనాన్ని పట్టుకు వెళ్ళలేదు, పదవులు పట్టుకు వెళ్ళలేదు, బ్రతికున్నప్పుడు ఒక్కడికి కూడా సాయం చేయలేదు, ఒక్క మంచి పని కూడా చేయలేదు" అని అనుకుంటారు. అందుకే ప్రాపంచిక జీవితంలో పరుగులు పెట్టే వారికి చివరకు అపవాదులే కాని ఆశీస్సులు రావు అని గ్రహించాలి.

ఈ ధ్యాన మార్గంలోకి వచ్చిన ఇంకా కొంత మందికి వాసనలు, సంస్కారాలు వదలక ప్రాపంచిక చింత అనేది ఉంటుంది. ధనం మీద, పదవుల మీద చింత లేకపోయినా బయటకు వెళ్ళి క్లాస్‌లు చెప్పినప్పుడు అందరూ నన్ను పొగడాలి, నన్ను మెచ్చుకోవాలి అనే చింత ఉంటుంది. కానీ మీరు సత్యం చెప్పినప్పుడు ప్రపంచం మీ వెనకాల పడుతుంది, అసత్యం చెప్పినప్పుడు ఎన్నో విమర్శలు వస్తాయి.

సత్యాన్ని బోధించనప్పుడు మీ ఎదురుగుండా మెచ్చుకోక పోయినా వెనకాల పొగుడుతారు, మీరు సత్యంలో జీవించినట్లయితే ప్రపంచం కోసం కాకుండా పరమాత్మ కోసం పనిచేస్తారు, అప్పుడే ఆ పరమాత్మకు ఇష్టం అవుతారు. అదే విషయం మనకు భగవద్గీతలో, ఉపనిషత్తుల్లో చెప్పబడింది.

ప్రాపంచిక జీవితం శాశ్వతం అనుకునేవాడు అజ్ఞాని, పరమాత్మ వైపు తిరిగి ఆయన శాశ్వతుడు అని తెలుసుకున్న వాడు జ్ఞాని, అందుకే ప్రతిఒక్కరిని అజ్ఞానం నుండి జ్ఞానం వైపు మరల్చాలి. దాని కంటే పుణ్య కార్యం ఈ భూమ్మీద ఏది లేదు అని ఉపనిషత్తులో చెప్పబడింది.

అందుకే పత్రి గారు మన చేత ధ్యానం చేయించడమే కాదు, ధ్యాన ప్రచారం కూడా చేయించారు, ఎందుకు అంటే ఈ భూమి మీద చేసే పుణ్య కర్మల అన్నిటిలోకి గొప్ప పుణ్య కర్మ మానవుడిని జ్ఞానిగా తయారు చేయడం.

"నేను జీవుడను, జీవించి ఉండేవాడు జీవుడు, నాకు మరణం లేదు" అని తెలుసుకున్నవాడే దేవుడు. శరీరం పోయినా నేను ఉంటాను, నేను శాశ్వతుడిని అని అనుకున్న జ్ఞాని దేవుడు అవుతాడు. అందుకే ప్రాపంచిక మానవుడు ఎప్పుడూ ఈ ప్రపంచం నన్ను పొగడాలి, ఈ శరీరం శాశ్వతం, ఈ శరీరం ఉండగానే నేను కీర్తి ప్రతిష్టలు, ఆస్తిపాస్తులు సంపాదించుకోవాలి అని అనుకుంటాడు.

ఈ ప్రాపంచిక జీవితంలో కోరికలు ఎంతగా ఉంటే అంతగా భయం

ఉంటుంది. వాడు సంపాదించిన ధనం, పిల్లలు ఎక్కడ ఖర్చు పెడతారో అనే భయం, నా దగ్గర డబ్బులు చూసి అందరు నన్ను అప్పు అడుగుతారేమో అని భయంలో బ్రతుకుతూ ఉంటాడు. ఈ భయాలు ఎప్పుడు పోతాయి అంటే ఆ భగవంతుడు మెచ్చుకునేలా ఉండాలి, లోకులు ఏం అనుకున్నా పర్వాలేదు కానీ లోకేశ్వరుడు మెచ్చుకునేలా బ్రతకాలి అని అనుకుంటే ప్రాపంచిక జీవితంలో చింతలు అన్నీ వదిలి నిశ్చింతగా బ్రతకగలరు.

ప్రాపంచిక జీవితంలో తృప్తిగా బ్రతుకుతూ ఆ భగవంతుడు గురించి తెలుసుకుంటూ, మీలో జ్ఞానాన్ని పెంచుకోవాలి. నేను జీవుడిని కాదు, ఈ శరీరమనే తొడుగు వేసుకుని ఈ భూమ్మీదకి వచ్చిన భగవంతుడిని నేను, ఏ జన్మలో ఏ పుణ్యం చేసుకుంటే ఈ జన్మలో పరమాత్మ రూపంలో ఒక సద్గురువు నా జీవితంలోకి వచ్చి ఈ సత్యాన్ని బోధించాడు అని తెలుసుకుంటారు.

ఈ భూమ్మీద ఒక్క మానవుడే సాధన చేసి తానెవరో, ఈ సృష్టి ఏంటో తెలుసుకోగలడు. సాధన లేని మానవుడు గాఢ నిద్ర పోతున్న జీవిలాగా జీవిస్తూ ఉంటాడు.

గాఢ నిద్ర పోయినప్పుడు మీకు ప్రపంచం అంటే ఏమిటో తెలియదు, మీ ప్రక్కన ఎవరున్నారో తెలియదు, మీరు ఎక్కడ ఉన్నారో తెలియదు. ఇప్పుడు మీరు కూడా అలాగే ఉన్నారు. మీకు థర్డ్ ఐ లేదు, ఏ లోకాలు చూడలేదు అందుచేత అవేవి లేవు అనుకోవడమే పెద్ద అజ్ఞానం.

అందుకే సద్గురువులు వచ్చి ఈ భూలోకం శాశ్వతం అను కుంటున్నావు, నీ శరీరం శాశ్వతం అనుకుంటున్నావు, కానీ ఇంతకంటే గొప్ప లోకాలు కోటాను కోట్ల లోకాలు ఉన్నాయి, అవి కూడా నువ్వు దేహం ఉండగానే చూడగలవు, దానికి ధ్యానం అనే ప్రాక్టీస్ కావాలి, ధ్యానం ప్రాక్టీస్ చేసినప్పుడు నీ మూడో కన్ను ఉత్తేజితం అవుతుంది. ఈ దేహం ఉండగానే నువ్వు అన్ని లోకాలు చూడగలవని మీకు చెప్తారు.

ఎన్నో పుస్తకాలు మహాత్ములు వ్రాసి మీ ముందు పెట్టారు, అవన్నీ స్వాధ్యాయం చేస్తూ, గురువు చెప్పిన ధ్యానం చేస్తే గురువు చెప్పింది సత్యజ్ఞానము అని నీకు అర్థమవుతుంది. అప్పుడు ప్రాపంచికంలో ఉన్న జీవితం నిశ్చింతగా ఉంటుంది. అందుకే ప్రాపంచిక జీవితంలో చింత ఎందుకు ఉంది? అంటే అన్ని కావాలి అనుకునే వాడికి చింత, ఉన్నదానితో తృప్తి పడిన వాడికి నిశ్చింత.

ధనం మీద వ్యామోహం వదిలి దైవం మీద వ్యామోహం పెంచుకున్న వాడు ఎప్పుడు నిశ్చింతగా ఉంటాడు. నీకు ఎంతగా ఆత్మ మీద ప్రేమ పెరుగుతుందో! ప్రాపంచిక జీవితంలో అంత తృప్తి ఉంటుంది. మీరు కోరుకున్నది వచ్చినా రాకపోయినా తృప్తే. నాకు ఇవ్వాలా వద్దా అని భగవంతుడికి తెలుసు. ఇవ్వలేదు అంటే నాకు అది అవసరం లేదు అని తృప్తితో జీవించగలుగుతావు. "చింత వదిలి నిశ్చింతగా జీవించాలంటే జ్ఞానం పెంచుకోవాలి." ప్రతిఒక్కరిని ధ్యానిగా తయారు చేయడమే ఈ భూమ్మీద అన్నిటికంటే గొప్ప పుణ్యకర్మ.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# అంతరంగ సంకేతాలు ఎవరికి వినిపిస్తాయి?

ఎవరికీ అంతరంగ పిలుపు వినిపిస్తుంది? ఎవరికి అంతరంగం నుంచి సంకేతాలు వినిపిస్తాయి? అన్నది తెలుసుకుందాం. ఎందుకంటే మీరందరూ ఈ ధ్యాన మార్గంలోకి వచ్చారు, ధ్యానం చేస్తున్నారు, జ్ఞానాన్ని వింటున్నారు, ఎంతో బాగా జీవిస్తున్నారు. మరి ఇదే విషయాన్ని ఇతరులకు చెబితే వారు వినరు, ఎందుకు వినరు? అనే విషయాన్ని తెలుసుకుందాం.

మీరందరూ గురువు దగ్గరికి వచ్చి ఎంతో జ్ఞానాన్ని తెలుసుకుంటూ, మీకు ఉన్న సందేహాలు అన్నీ నివృత్తి చేసుకుంటూ ఉంటే మీ మనసు పరిపూర్ణత్వం పొందుతుంది.

ఈ మార్గంలోకి వచ్చిన మీరు శరీరం అనే భ్రాంతిని పోగొట్టుకుని మీరు ఆత్మ అని తెలుసుకున్నారు కానీ మీ మనసు ప్రభావం వలన ఒక్కోసారి కొన్ని విషయాలు అవగాహన చేసుకోలేక బాధపడుతూ ఉంటారు.

ఈ ప్రాపంచిక జీవితంలో ఎన్నో సుఖాలు, భోగాలు అనుభవించినా ఆనందం దొరకక వాటి మీద విరక్తి కలిగి ఏదో ఒక సందర్భంలో ఆధ్యాత్మిక మార్గంలోకి వస్తారు. అలా వచ్చినవారు మొదట్లో "నేను నా స్నేహితుల వల్ల ఈ మార్గంలోకి వచ్చాను, అనారోగ్య సమస్యల వల్ల వచ్చాను, నాకున్న కష్టాలు తీర్చుకోవడానికి వచ్చాను" అని అనుకుంటారు కానీ ప్రతి ఒక్కరికీ ఆత్మ నుండి ఒక సంకేతం అందుతుంది, అటువంటి వారే ఈ మార్గంలోకి వస్తారు.

నా విషయాన్నే తీసుకుంటే నేను నా జీవితంలో ధ్యాన మార్గంలోకి రాకూడదు, నేను ధ్యానం చేయకూడదు అని అనుకున్నాను. కానీ నాకు ఒక కష్టం వచ్చినప్పుడు రాఘవరావు గారు "నా మాట విని ఒకసారి ధ్యానం చేస్తే నష్టం ఏమిటి? ధ్యానం చేసి చూడు" అని చెప్పారు. అప్పుడు నేను సరే ఒకసారి ధ్యానం చేసి చూద్దాం అని అనుకున్నాను అంటే అది ఆత్మ నుండి

మనసుకు వచ్చిన సంకేతమే కదా?

ఈ ప్రాపంచిక జీవితంలో విసుగు వచ్చి ఆధ్యాత్మిక మార్గంలోకి రావాలి అని కొంత మందికి మాత్రమే అనిపిస్తుంది. మాకు ఎంతో సంపద ఉంది, చక్కటి పిల్లలు ఉన్నారు, రాఘవరావు గారికి ఎన్నో పదవులు ఉండేవి, అయినా కూడా ఆయనకు జీవితంలో తృప్తి కలగలేదు. ఇంకా ఏదో తెలుసుకోవాల్సి ఉంది అని ఆయనలో అంతరంగ మథనం ఉండేది. పూజలు ఎక్కువ చేసేవారు, గుడి కూడా కట్టించినా ఆయనకి తృప్తి కలగలేదు.

ఇంకా తెలుసుకోవాల్సింది ఏదో ఉంది, అది ధ్యానం ద్వారానే తెలుసుకోగలను అని ఎంతో మంది గురువుల దగ్గరకు వెళ్లారు. ఒకసారి మలయాళ స్వామి వారి ఆశ్రమంకు వెళ్లినప్పుడు అక్కడ స్వామి వారి గురించి ఒక పుస్తకంలో చదివినప్పుడు నేను ఈ స్వామి జీవించి ఉన్నప్పుడు నేను శిష్యుడుగా ఉంటే బాగుండేది కదా? అని అనుకున్నారట. అప్పుడే ఆ పరమాత్ముడు పత్రి గారిని మా జీవితంలోకి పంపటం జరిగింది.

ఈ ప్రాపంచిక జీవితంలో జీవించే వారికి శాంతి అనేది ఆత్మలో ఉంటుంది అని తెలియదు. ఎన్నిసంపదలున్నా, ఎన్నో సుఖాలు భోగాలు ఉన్నా శాంతి అనేది ప్రాపంచిక జీవితంలో దొరకదు. ఎప్పుడైతే ఆధ్యాత్మిక జీవితంలోకి వస్తారో! మీ జీవితంలోకి సత్యాన్ని బోధించే ఒక సద్గురువు వస్తాడో! అప్పుడు మీ జీవితంలో శాంతిని పొందుతారు.

ఈ అంతరంగ మథనం ఉన్న వాళ్ళకు సత్యాన్ని బోధించే పుస్తకాలే నచ్చుతాయి కానీ పుణ్యం, పాపం గురించి బోధించే పుస్తకాలు నచ్చవు. ఇప్పుడు చూడండి ఆత్మోద్ధరణకి, ఆత్మ శక్తిని పెంచుకోవడానికి జ్ఞానం పెంచుకునే పుస్తకాలే మీకు నచ్చుతాయి.

అలా బాహ్య జీవితం పై విసుగెత్తినప్పుడు మీకు తెలియని ఒక వైరాగ్యం వస్తుంది. చాలామంది చూడండి కోట్లు కోట్లు సంపాదిస్తూ ఉంటారు,

కానీ తృప్తి వుండదు. పదవులు ఉంటాయి అయినా తృప్తి వుండదు. ఇలా బాహ్య ప్రపంచంలో తృప్తి లేనప్పుడు వైరాగ్యం వస్తుంది. జీవితంలో కావాల్సింది ఇది కాదు వేరే ఉంది అని బాహ్య దృష్టి నుంచి అంతర్ దృష్టికి వెళ్తారు, ఇదే అంతరంగ పిలుపు. ఆ పిలుపు ఆత్మ నుండి మనసు ద్వారా మీకు అందుతుంది. అందుకే మనసు అనేది ఆత్మను చేరడానికి ఒక సింహద్వారము.

తమోగుణం, రజోగుణంలో ఉన్న వాళ్ళు బాహ్య ప్రపంచంలో ఉన్న సంతోషాలకు మురిసిపోతూ ఉంటారు. అశాశ్వతమైన చిన్న చిన్న సంతోషాలు అయిన సంపదలు, సంతానం, ఆస్తిపాస్తులు చూసుకొని అదే జీవితం అనుకోని తృప్తి పడతారు. ఇటువంటి వారికి అంతరంగ పిలుపు అవసరం లేదు, ఆత్మ దగ్గరకు చేరాల్సిన అవసరం లేదు, కళ్ళు మూసుకుంటే ఏమోస్తుంది, ఇప్పుడు కాదులే, ఇంకా టైమ్ ఉంది, వృద్ధాప్యం రావాలి అని అనుకుంటారు.

కానీ ఎవరైతే సాత్విక గుణంలోకి వస్తారో ప్రాపంచికంగా ఎన్ని సంపదలు వున్నా, ఎన్ని సుఖాలు, భోగాలు వున్నా వారికి జీవితంలో తృప్తి ఉండదు. వీరికి బాహ్య దృష్టి వదలి, అంతరంలోకి వెళ్ళాలి అని అనిపిస్తుంది. ప్రపంచ ఆకర్షణలకు తృప్తిపడే వాడికి ఎప్పటికీ అంతర్ దృష్టి రాదు.

చూడండి కొంతమంది ఎన్నో పూజలు చేస్తూ ఉంటారు, కానీ వారికి తెలియదు భగవంతుడు బాహ్య ప్రియుడు కాదు అంతర్ ప్రియుడు అని. ఈ సృష్టి అంతా ఆ భగవంతుడిదే అయినప్పుడు ఆయనది ఆయనకే అర్పిస్తున్నాం అన్న విషయం తెలియక “ఈ రోజు నేను బాగా పూజ చేశాను, రకరకాల పూలతో బాగా అలంకరించాను, ఎన్నో రకాల ప్రసాదాలు వండి వడ్డించాను” అని తృప్తి పడతారు.

ఇంకా కొంతమంది తీర్థ యాత్రలకు వెళ్తారు, అక్కడ దేవుడి దర్శనాలు బాగా అయ్యాయి, రికమెండేషన్ లెటర్ తో వెళ్లి అభిషేకాలు, పూజలు చేయించుకున్నాం. దేవుడ్ని దగ్గరగా బాగా చూశాను అని చెబుతూ ఉంటారు.

ఇంకా కొంతమంది హిమాలయాలకు వెళ్తారు, అక్కడ నడవలేక డోలీలు కట్టించుకుని వేరే వాళ్ళు మోసుకుంటూ పైకి తీసుకు వెళ్తే అక్కడ దేవుడ్ని చూసి దర్శనం బాగా జరిగింది అని తృప్తి పడతారు. ఇటువంటి వారందరూ రజో గుణంలో ఉన్నవారే, బాహ్యాకర్షణ చూసి సంతోష పడుతుంటారు.

ఎవరైతే సాత్విక గుణం లోకి వస్తారో ఈ బాహ్యాకర్షణ కంటే అంతరంగంలోని ఆకర్షణ ఇంకా గొప్పది అని తెలుసుకుంటారు. ఇలాంటి వారందరూ అజ్ఞానపు దశ నుండి జ్ఞాన దశకు వచ్చినవారు. ఇటువంటి వారికి అంతరంగ పిలుపు వినపడుతుంది. భాహ్యాకర్షణలో ఉన్నవాడికి అంతరంగ పిలుపు వినపడదు. బాహ్యాం కంటే అంతరంలో ఏదో ఉంది అని తెలుసుకోవాలి అనుకున్నవారు సాత్వికం లోకి వచ్చినట్లే. సాత్విక గుణమే సత్యానికి దగ్గర చేస్తుంది.

అందుకే ఈ మార్గంలోకి రమ్మని ఎంత చెప్పినా వారు రాకపోవడానికి కారణం వారి యొక్క గుణాలు. తమో గుణం, రజో గుణం కలిగి ఉన్నవారు మీరు ఎంత చెప్పినా సత్యాన్ని తెలుసుకోలేరు. ఎవరైతే సాత్విక గుణం లోకి వస్తారో వారు సత్యాన్ని తెలుసుకోగలుగుతారు.

అంతర్ ప్రపంచంలో ఆనందమే లేకుంటే యోగులు, రుషులు, మునులు ఎందుకు ఎప్పుడూ ధ్యానంలో ఉంటారు?

ఈ ప్రపంచంలో ఒక కోటీశ్వరుడి ని చూసి వీడు ఎలా కోటీశ్వరుడు అయ్యాడు? అని ఆలోచిస్తారు, కానీ ఒక యోగిని చూసి వీడు బాహ్యాకర్షణ లు అన్నీ వదిలి ఎలా అంతర్ముఖుడు అయ్యాడు? అని ఆలోచించరు.

బాహ్యంలో కంటే అంతరం లోనే ఎక్కువ ఆనందం ఉంది అని సాత్విక గుణంలో ఉన్నవారే గ్రహించగలరు. అటువంటి వారికి ఆ భగవంతుడు కష్టాలను ఇచ్చి తన వైపుకు తిప్పుకుంటాడు అంటే ఆత్మ వైపుకు తిప్పుకుంటాడు.

ఇటువంటి వారు అందరి బాగు కోరతారు, ఎవరికీ హాని చేయరు, సేవా మార్గంలో ఉంటారు, కానీ వారిలో ఇంకా ఏదో అసంతృప్తి ఉంటుంది. దానికి కారణం ఏమిటి? అని వారిలో అంతర్మథనం కలిగినప్పుడు వారి జీవితంలోకి ఆ పరమాత్మ ఒక సద్గురువుని పంపుతాడు.

ఆ భగవంతుని కృప వల్లనే సద్గురువులు దొరుకుతారు, ఈ ఆధ్యాత్మిక మార్గంలో ఎదగాలి అంటే భగవంతుని కృప, గురుకృప ఉండాలి అని శంకరాచార్యులవారు చెప్పటం జరిగింది.

మరి ఈ విధంగా బాహ్యంగా ఎన్ని ఉన్నా తృప్తి లేని మానవులకి, ఏదో ఒక చిన్న కష్టం వచ్చినప్పుడు నేను ఇన్ని రోజులు ఈ సంసారంలో ఎన్నో అబద్ధాలు ఆడాను, ఎన్నో కర్మలు చేశాను, నాకు డబ్బు సంపాదనే ధ్యేయం అనుకున్నాను, పదవులు పొందటమే ధ్యేయం అనుకున్నాను వీటి లోనే ఆనందాన్ని వెతుకుతున్నాను, కానీ అదేమో దొరకలేదు అనుకుంటారు. కానీ ఆనందం ఆత్మలోనే ఉంది అని తెలుసుకున్నప్పుడు ఎంతో తృప్తిగా జీవిస్తూ, ఈ బాహ్య ప్రపంచంలోనే అంతులేని ఆనందం ఉంటే అంతరంలోకి వెళ్తే ఇంకా ఎంత ఆనందం ఉంటుందో అని అంతర్ముఖుడు అవుతాడు.

అందుకే భగవంతుడు గొప్పవాడు ఆయన అన్నీ బయట వుంచి తాను మాత్రం అంతరంలో దాక్కున్నాడు. ఈ విషయం కొద్ది మంది మాత్రమే తెలుసుకో గలుగుతారు. భగవద్గీతలో కూడా కృష్ణ భగవానుడు ఎంతో మంది భగవంతుడి గురించి తెలుసుకుంటారు కానీ నా తత్వాన్ని మాత్రం అతి కొద్దిమంది తెలుసుకొని నన్ను చేరుకుంటారు అని చెప్పారు.

లోకమంతా కూడా భగవంతుడు ఉన్నాడని ఒప్పుకున్నా ఆ భగవంతుడు ఎక్కడ ఉన్నాడు? ఎలా చేరుకోవాలి? అనే పరమ సత్యం కొద్దిమందికి మాత్రమే తెలుస్తుంది. భగవంతుడునే కోరుకుంటే అంతులేని ఆనందం అనుభవిస్తారు. ఈ సృష్టిలో ఎన్ని పొందినా భగవంతుడిని

కోరుకున్నవాడే ఆనందంగా జీవిస్తాడు అని మన సొసైటీలో రాఘవరావు గారి శిష్యులకు మాత్రమే తెలుసు అని నేను చాలా గర్వంగా చెప్పగలను.

ఎందుకు అంటే మన సొసైటీలో అందరూ కూడా సంకల్పాలు పెట్టండి, ఈ ధ్యానం చేయండి, ఆ ధ్యానం చేయండి అని చెబుతారు కానీ పత్రి గారు నువ్వు ఆత్మ అని తెలుసుకోవడానికి "శ్వాస మీద ధ్యాస" పెట్టి ధ్యానం చేయి అని రెండు ముక్కలలో చెప్పేశారు. మీలో శక్తి పెంచుకోవాలి అంటే సరైన ధ్యానం చేయాలి, సరైన ధ్యానం చేస్తేనే సరైన ఫలితాలు పొందుతారు.

పత్రి గారు ''శ్వాస మీద ధ్యాస'' పెట్టి ధ్యానం చేసి మీ అంతరంగంలోకి వెళ్ళండి అని చెబితే అది అర్థంకాక చాలా మంది రకరకాల ధ్యానాలు చేసి అంతరంగాన్ని మూసుకుంటున్నారు, ఆ అంతరంగ మథనం వినిపించుకోలేక పోతున్నారు, ఎందుకు అంటే అటువంటి ధ్యానాల వల్ల అంతరంగ సంకేతాలు మనసుకు అందవు. మనసు బాహ్య ప్రపంచంవైపు తిప్పి ఉంచితే అంతరంగ ప్రబోధాలు వినిపించవు.

కొంతమంది ఆరోగ్యం కోసమే ధ్యానం అంటారు. శరీరం కోసం ధ్యానం అంటే అది ఎంత హాస్యాస్పదమో తెలుసుకోండి. మీ శరీరంలోని అన్నమయ కోశానికి సరైన ఆహారం ఇచ్చినప్పుడు, ఏ కర్మలు నీకు లేనప్పుడు నీకు రోగమే రాదు. నీ శరీరం రోగగ్రస్తం అయ్యింది అంటే సరి కాని ఆహారం ఏదో తిన్నావు, సరి కాని ఆలోచన చేశావు అని విచారణ ద్వారా తెలుసుకోవాలి.

అంతే గాని నశించిపోయే ఈ శరీరం కోసం, ధ్యానం ద్వారా నువ్వు పొందే ఆత్మ శక్తిని ఖర్చు పెట్టకూడదు అని జ్ఞానం ద్వారా తెలుసుకోవాలి. ధ్యానం అనేది జ్ఞానం కోసమే అని ప్రతి ఒక్కరూ తెలుసుకుంటే ఆనందంగా జీవించగలరు. ఆనంద స్వరూపుడైన ఆత్మ దగ్గరే ఆనందం ఉంటుంది కానీ ఆనంద స్వరూపుడు సృష్టించిన ఈ బ్రహ్మాండంలో సుఖ, సంతోషాలు ఉంటాయి

కానీ ఆనందం ఉండదు. సుఖసంతోషాలు శాశ్వతమైనవి కావు ఈ రోజు ఉండొచ్చు, రేపు పోవచ్చు. కానీ ఆనందం అనేది శాశ్వతం నిత్యం ఉంటుంది అని ఉన్నదానితో తృప్తి పడుతూ ధ్యానం చేస్తూ ఆనందంగా జీవించాలి. ఈ సుఖ సంతోషాలు తృణప్రాయంగా ప్రక్కన పెట్టి ఆనందం కోసం అన్వేషించినవాడే మహాయోగి.

బాహ్య ప్రపంచంలో సర్వ సుఖాలను అనుభవించినా నీ అంతరంలో శాశ్వతమైన సుఖము ఉంది అని తెలుసుకున్నవాడే చాలా గొప్పవాడు. అందుకే సాత్విక గుణంలోకి వచ్చే వరకు అంతరంగంలో పిలుపు వినపడదు. అంతరంగ పిలుపు సత్వగుణంలోకి వచ్చిన వారికి వినిపిస్తుంది అంటే తమోగుణంలో, రజోగుణంలో పాపాలు ఎక్కువ చేస్తారు కాబట్టి, కర్మలు ఎక్కువ చేస్తారు కాబట్టి నీ మనసు మురికితో ఉంటుంది అందుకే అంతరంగ పిలుపు వినపడదు.

పాప కర్మలు చేయడం మానేసి, పుణ్య కర్మలను సత్కర్మాలుగా మార్చుకుంటూ, మీ కర్మ ఫలాన్ని సన్యసించినప్పుడు మీ అంతరంగ పిలుపు మీకు వినిపిస్తుంది. అందుకే చూడండి ఈ ధ్యాన మార్గంలోకి వచ్చిన వారు ఒక వారం రోజులు ఇంట్లో ఏదో పని ఉండి అంటే ఫంక్షన్ కానీ, పెళ్లికాని ఉంది అని ధ్యానం చేయకపోతే మీ మనసులో ఏదో వెలితి, ఏదో తప్పు చేశాననే భావం ఉంటుంది. ఈరోజు ధ్యానం చేయలేదు, స్వాధ్యాయమూ చేయలేదు, ఈ నెల నేను భీమవరం క్లాసులకు వెళ్లలేదు అని మీరు అంతరంలో క్షోభ అనుభవిస్తారు.

బాహ్య సుఖాలకు విసుగు చెంది వైరాగ్యం పొందినప్పుడు సత్వ గుణంలోకి వచ్చి తృప్తిగా జీవితాన్ని జీవిస్తారు. ఉదాహరణకు మీ భోజనంలో ఆ రోజు చేసిన కూర మీకు నచ్చింది అంటే ఇంకో గరిటె వేసుకొని తింటారు, అంతే గాని గిన్నెలో ఉన్నదంతా తింటే మీకు వెగటు వేస్తుంది. అలానే బాహ్య సుఖాలు ఎన్ని అనుభవిస్తున్నా మీ మనసుకు పరిపూర్ణమైన తృప్తి రాదు అంటే

అంతరంలో నువ్వు కోరుకున్నవన్నీ ఉన్నాయి అని ఆత్మ మనసుకు సంకేతం అందిస్తుంది. అందుకే చూడండి బాహ్యంవైపు తిరిగిన మనసు మనకు శత్రువు అవుతుంది, అదే అంతరంలో తిరిగిన మనసు మనకు మిత్రుడు అవుతుంది. రెండింటికి కారణం మనసే. ఆత్మ నుంచి వచ్చే సంకేతాలు పెడచెవిన పెట్టేది మనసే, ఆత్మ నుంచి వచ్చే సంకేతాలను ఆచరించి అంతరంలోకి తిప్పేది మనసే.

తమోగుణం, రజోగుణం లో కర్మలు ఎక్కువ ఉన్న మూలాన అంతరంగంలో ఉన్న పిలుపు వినపడదు. ప్రపంచ ఆకర్షణ, ఇంద్రియాలను సుఖపెట్టాలని కోరిక ఉన్నవాడికి అంతరంగ పిలుపు వినిపించదు. ఎన్ని దానాలు చేసినా తృప్తి లేక, ఎన్ని పుణ్య కర్మలు చేసినా తృప్తి లేక, సుఖాలు భోగాలు అనుభవించినా తృప్తి లేక ఇంకా ఏదో ఉంది నేను చేయవలసినది, నేను తెలుసుకోవలసింది అని సత్వగుణంలోకి వచ్చిన వారికి మాత్రమే తెలుస్తోంది.

ఈ విషయాలు అన్నీ నేను రాఘవ రావు గారి దగ్గర చూశాను. ఎప్పుడు ఆయన దృష్టి అంతా పరుల సేవ మీదే ఉంటుంది. ఆయన దగ్గర ఉన్న ధనాన్ని దానాలకు, పుణ్య కార్యక్రమాలకు ఖర్చు పెడుతూ ఉండేవారు. అలా చేస్తూ కూడా వాటిలో తృప్తి లేక నాకు ఇంకేదో కావాలి అని పరితపించేవారు. పత్రి గారి పరిచయం తర్వాత తను కోరుకున్న జీవితం తనకు వచ్చింది అని తృప్తి పడ్డారు. ఈ 77 ఏళ్ళ వయసులో కూడా నిరంతరము తిరుగుతున్నారంటే  ధ్యానం మీద,  జ్ఞానం మీద, భగవంతుడి మీద ఎంత ఇష్టమో ఆయన దైనందిక జీవితం చూసిన వారికి అర్థం అవుతుంది.

మన మనసుకి ఉన్న గుణాల వల్లే మన ప్రవర్తన ఉంటుందని ఎన్నో క్లాసుల్లో చెప్పుకున్నాం. మీ మనసు రజో గుణంలోకి వెళ్లినప్పుడు మొదటి మెట్టు పుణ్య కర్మలు చేస్తాం, రెండో మెట్టు సత్కర్మలు చేస్తాం, మూడో మెట్టు ధ్యానంలోకి వెళ్తారు. మీ ఆత్మే నడిపిస్తూ ఉంటుంది, మనసును కూడా. మంచి

గుణాలు ఉన్న మహాత్ములకి భగవంతుడి నుంచే పిలుపు వస్తుంది. ఏ పిలుపు అంటే అంతరంలోకి తిరుగు అనే ఒక పిలుపు వినిపిస్తుంది, అప్పుడే వాళ్ళు బాహ్య దృష్టిని, అంతర్ దృష్టిగా మార్చుకుంటారు.

మీ దృష్టి బాహ్య దృష్టి అయినప్పుడే ప్రతిది కష్టంలా అనిపిస్తుంది, మీ బాహ్య దృష్టి అంతర్ దృష్టి అయినప్పుడు ఎన్ని కష్టాలు వచ్చినా కర్మ పోతుంది అని తృప్తితో ప్రతిది అంగీకరిస్తారు. మీ జీవితంలో ఏం జరుగుతున్నా యక్సెప్ట్ చేయడం అలవాటు చేసుకుంటారు.

ఎందుకంటే భగవంతుడికి తెలియంది, భగవంతుడు నిర్ణయించంది ఏది భూమిమీద జరగదు. ఈరోజు మనకు కష్టం వచ్చింది అంటే ఏదో ఒక కర్మ ఉంది కష్టం వచ్చింది, పాప కర్మ లేకపోతే కష్టం రాదు, పుణ్య కర్మ లేకపోతే భోగము రాదు అని తెలుసుకొని ఏదైనా కష్టం వచ్చినా దుఃఖ పడకుండా కర్మ పోయింది అని తృప్తిగా జీవించగలిగిన వాడు అసలైన ఆధ్యాత్మికవాది.

బాహ్య జీవితం పై విసుగు అనేది ఆధ్యాత్మిక జీవితానికి పునాది అని, బాహ్య జీవితంలో ఆనందం లేదు అని, ఆనందం అనేది అంతరం లోనే ఉంది అని తెలుసుకొని, బాహ్యాన్ని వదలి అంతరంలోకి వెళ్ళాలి. ఈ విషయం తెలుసుకున్నవారు ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా కాళీ దొరికినప్పుడల్లా ధ్యానం చేస్తారు.

ఈ మార్గంలోకి వచ్చిన మీరందరూ తృప్తికరమైన జీవితం జీవిస్తూ, మీకు ఎంత కష్టం వచ్చినా అది నా కర్మ ఫలమే అని తెలుసుకున్నారు కాబట్టి సాధన చేయగలుగుతున్నారు. సాత్విక గుణంలో ఉన్న మీరు ఎప్పటికప్పుడు విచారణ చేసుకుంటూ మరలా వెనక్కి తమో గుణంలోకి, రజో గుణంలోకి పడిపోతున్నామేమో, నాకు కోరికలు వస్తున్నాయా? అని ఎక్కడికక్కడ విచారణ చేసుకుంటూ మీ సాధనలో పురోగమనం సాధించాలి.

అందుకే సాత్విక గుణంలోకి వచ్చిన మీరు సాధన చేస్తూ

ఎప్పటికప్పుడు మీ గుణాలు వెనక్కి వెళ్లిపోకుండా చూసుకుంటూ, మనసు శుద్ధత్వంలో ఉంచుకుంటే అంతరంగ పిలుపు మీకు వినపడుతుంది. మీ మనస్సును శుద్ధంగా ఉంచుకుంటే మీకు రెండు లాభాలు ఉంటాయి.

1) పుణ్య కర్మలు, పాప కర్మలు చెయ్యరు 2) ఆత్మ కర్మలే చేస్తూ జ్ఞానం పెంచుకుంటూ మోక్షం వైపు ప్రయాణిస్తారు.

అందుకే ప్రతి వ్యక్తి ముందు మనసుని సత్వగుణంలో ఉంచుకోవాలి, ప్యూరిటీగా ఉండాలి, ఈవేళ నేను ఏమైనా తప్పు చేసానా? ఎవరినైనా బాధ పెట్టానా? ఏదైనా అబద్ధం చెప్పానా? అని రోజు చెక్ చేసుకోవాలి. మీ ఆలోచన, మీ మాట, మీ పని ఈ మూడు కూడా సరిగ్గా ఉంచుకోవాలి. అంటే త్రికరణ శుద్ధితో ఉండాలి. నీ మాట చేత ఆలోచనల ఒక్కటైనప్పుడు మీ మనసు దూరంలో ఉంటుంది అప్పుడు మీరు ఆత్మకు దగ్గరవుతారు. సాధన చేయడం అంటే ఆత్మశక్తిని పెంచుకోవడం. ఆలోచనలతో ఆత్మశక్తిని ఖర్చు పెట్టుకొని బికారిగా మిగలకుండా వ్యర్థపు ఆలోచనలు చేయకుండా సాధన చేసి మోక్షాన్ని పొందాలి.

మరి మీరు అందరు కూడా సాధన చేసి మీ బాహ్య దృష్టిని అంతర్ దృష్టిగా మార్చుకొని ఆంతరంగిక పిలుపు వినే శక్తిని ధ్యానం ద్వారా పొందండి.



# Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Which is the right meditation ? | Rs.100 |
| 4. | Die before death! | Rs.120 |
| 5. | The Law of Karma | Rs.100 |
| 6. | Losses caused by Desires | Rs.100 |
| 7. | Benefits of knowing what happens after death | Rs.100 |
| 8. | What is Meditation? | Rs.80 |
| 9. | True Path | Rs.80 |
| 10. | Why soul-knowledge | Rs.70 |
| 11. | What comes after death ? | Rs.70 |
| 12. | Learnings through the male and female births | Rs.70 |
| 13. | Who are Soul-murderes? | Rs.70 |
| 14. | How to improve Financial Status ? | Rs.60 |
| 15. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 16. | What is Intention? | Rs.50 |
| 17. | Why is this life? | Rs.50 |
| 18. | Shankaracharya's Jagrata panchakam | Rs.50 |
| 19. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 20. | Brahman means? | Rs.50 |
| 21. | How to become a master? | Rs.50 |
| 22. | How to become a champion ? | Rs.50 |
| 23. | Truth | Rs.50 |
| 24. | Meditation for the Development of Students | Rs.40 |
| 25. | Non violence and vegetarianism | Rs.40 |

| | |
|---|---|
| REBIRTH (Tatavarthy Rajya Lakshmi) | Rs.150 |
| What is Ignorance (Avidya) ? | Rs.70 |



# श्री तटवर्ती वीर राघवराव के हिन्दी किताब

1. आत्म शास्त्र । ........ Rs.200/-
2. ध्यान विद्या । ........ Rs.160/-
3. भगवद गीता का सार । ........ Rs.160/-
4. सत्य मार्ग । ........ Rs.160/-
5. मरने से पहले मरना है। ........ Rs.130/-
6. गाईडिंग ध्यान क्यों नहीं ? ........ Rs.120/-
7. भगवान कौन है। ........ Rs.120/-
8. कर्म सिद्धांत । ........ Rs.120/-
9. विज्ञान का अर्थ - निहितार्थ । ........ Rs.120/-
10. ब्रह्म ज्ञान । ........ Rs.100/-
11. यह जीवन क्यों है ? ........ Rs.100/-
12. मेहर बाबा का संदेश । ........ Rs.100/-
13. कौन सा ध्यान सही है ? ........ Rs.100/-
14. इच्छाओं के कारण होने वाली हानियाँ ........ Rs.100/-
15. शंकराचार्य जी का ज्ञान संदेश ........ Rs.100/-
16. कठोपनिषद् ........ Rs.100/-
17. मरने के बाद, साथ में आने वाले विषयों । ........ Rs.80/-
18. भगवत के दृश्यों का अर्थ । ........ Rs.80/-
19. आत्म हंतक कौन होता है । ........ Rs.70/-
20. स्त्री जन्मों में सीखने वाले विषयों, पुरुष जन्मों में सीखने वाले विषयों।. Rs.70/-
21. दुख निवारण का मार्ग ........ Rs.75/-
22. उत्तम पुरूष ........ Rs.60/-
23. आर्थिक स्थिति बढाना है तो ? ........ Rs.60/-
24. निर्वाण मार्ग ........ Rs.60/-
25. सत्य ........ Rs.50/-
26. क्या हम इस लोक के वासी हैं या परलोक के वासी हैं ? ........ Rs.50/-
27. गुरू को पहचानना कैसे ? ........ Rs.50/-
28. विद्यार्थियों के विकास के लिए ध्यान विद्या ........ Rs.50/-
29. शाकाहार ही मानव का आहार है! ........ Rs.50/-
30. ब्रह्मं क्या है ? ........ Rs.50/-
31. शंकराचार्य जी का जाग्रत पंचक ........ Rs.50/-
32. शंकराचार्य जी का निर्वाण शट्कम ........ Rs.50/-
33. चैंपियन बनना हो तो ? ........ Rs.50/-
34. तीन प्रकार के जीवन ........ Rs.50/-
35. संकल्प अर्थात ? ........ Rs.40/-

# తోటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించకముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) మానవునిలోని చెడు -రూ.70/-
41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
42) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
43) కబీరు సందేశాలు-1 -రూ.70/-
44) కబీరు సందేశాలు-2 -రూ.60/-
45) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
46) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
47) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
48) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
49) అతీంద్రియ శక్తులు - రూ.60/-
50) ఆలోచించండి - రూ.60/-
51) నిర్వాణ మార్గం - రూ.60/-
52) ధ్యానులకు సూచనలు - రూ.60/-
53) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
54) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/-
55) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
56) సంకల్పమంటే? - రూ.50/-
57) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
58) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
59) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
60) అరిహంత్ - రూ.50/-
61) మూడురకాల జీవితాలు -రూ.40/-
62) ఆర్థిక పరిస్థితి పెంచుకోవ్వాలంటే- రూ.40/-
63) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
64) బ్రహ్మం అంటే? -రూ.40/-
65) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
66) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
67) మహాత్ముల సందేశాలు - రూ.40/-
68) సత్యం - రూ.40/-
69) చక్రాలు - రూ.40/-
70) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
71) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
72) మౌన ధ్యానం - రూ.40/-
73) విదురుని సందేశాలు - రూ.40/-
74) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
75) శాకాహారమే మానవాహారం - రూ.15/-
76) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



మానవుడి పురోగమనం మనసు వల్ల ఉంటుంది. మనసు ప్రపంచం వైపు తిరిగితే పురోగమనం మందకొడిగా ఉంటుంది. మనసు ఆత్మ వైపు తిరిగితే పురోగమనం ఎక్కువగా ఉంటుంది.

మానవుడి మనస్సు ‘పంచావస్థలలో’ ఉంటుంది. అవి 1) స్మృతి, 2) మతి, 3) బుద్ధి, 4) ప్రజ్ఞ, 5) ప్రతిభ.

మన మనసు ఈ పంచావస్థలో ఉంటే మొట్టమొదట మన కోసమే మనం అన్నట్టుగా బ్రతుకుతాం, చిట్టచివరికి అందరి కోసమే ఈ దేహం తీసుకున్నాను అని అర్థమవుతుంది. అలా అర్థమైనప్పుడే ఆనందకరమైన జీవితం జీవించడానికి అవకాశం ఉంటుంది.

మీ మనసు అంతరంలోకి వెళ్ళినప్పుడు విశాలత్వం పొందుతుంది. అంటే అందరికీ సహాయం చేయాలి, అందరిని జ్ఞానవంతులను చేయాలి అని కోరిక ఉన్న మనసు చాలా గొప్ప మనసు. అటువంటి మనస్తత్వాన్ని అలవాటు చేసుకుంటూ అందరూ బాగుండాలి అనే కోరిక ప్రతి ఒక్కరికి ఉండాలి.

- బ్రహ్మావిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.40/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|